


పెల్లుబుకిన ప్రభుత్వ వ్యతిరేకత?



వైసీపీపై పలు వర్గాల్లో స్పష్టంగా కనిపించిన అసంతృప్తి

- కూటమి అభ్యర్థులకు ఓట్ల వర్షం
- జగన్ పాలనపై యువత, నిరుద్యోగులు, విద్యావంతుల్లో అసహనం
- నిత్యావసర ధరలు, విద్యుత్/ఆర్టీసీ చార్జీల పెంపు ప్రధాన కారణం
- మహిళలను ఆకర్షించిన కూటమి మేనిఫెస్టో
- ఉమ్మడి విశాఖ జిల్లాలోని అనేక నియోజక వర్గాల్లో ఇదే ట్రెండ్
- స్థానిక పరిస్థితుల మేరకు మూడు, నాలుగు నియోజక వర్గాల్లోనే వైసీపీ అభ్యర్థులకు కాస్త సానుకూలత
- మిగిలినచోట్ల కూటమి వైపు మొగ్గు చూపిన ఓటర్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

"వైసీపీ ఐదేళ్ల పాలనలో విశాఖ నగర అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగలేదు. పైగా ప్రతిపక్షాలకు చెందిన ఆస్తులపై దాడులు. ఇవన్నీ కక్షపూరిత రాజకీయాలకు దారితీసేలా కనిపించాయి. జగన్‌కు పాలనా అనుభవం లేదని స్పష్టంగా తేలింది. వ్యక్తిగత లబ్ధి, ద్వేషం కంటే... రాష్ట్రాభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చే నాయకుడిని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని అర్థమైంది. అందుకే నాతోపాటు నా సర్కిల్‌లోని ఎంతో మంది ఉదయాన్నే వెళ్లి కూటమి అభ్యర్థులకు ఓటేసి వచ్చాం"

- నగరానికి చెందిన ఓ ప్రముఖ వైద్యుడు

"ఐదేళ్లలో నిరుద్యోగులకు ఈ ప్రభుత్వం తీరని ద్రోహం చేసింది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ విషయంలో నిరాశపరి చింది. ఈ ప్రభుత్వానికి ఓటుతోనే బుద్ధి చెప్పాలని కుటుం బ సభ్యులతోపాటు బంధువులతోనూ కూటమి అభ్యర్థులకు ఓటు వేయించాను"

- ఒక నిరుద్యోగి

సార్వత్రిక ఎన్నికల్లో మెజారిటీ వర్గాలు కూటమి వైపు మొగ్గు చూపినట్టు స్పష్టంగా కనిపిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా అధికార పార్టీపై అనేక వర్గాల్లో తీవ్రమైన వ్యతిరేకత కనిపించింది. ముఖ్యంగా యువత, ఉద్యోగులు, విద్యావంతులు, వ్యాపారులు, మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి, ఉన్నత వర్గాలకు చెందిన ప్రజలు వైసీపీకి వ్యతి రేకంగా ఓటేసినట్టు చెబుతున్నారు. గడిచిన ఐదేళ్లలో ప్రభు త్వం తీసుకున్న నిర్ణయాలు, పాలనా వైఫల్యాలతో విసిగి పోయిన ఎంతోమంది మార్పు కావాలని పోలింగ్ కేంద్రాల వద్ద బహిరంగంగా మాట్లాడుకోవడం వినిపించింది. ముఖ్యంగా యువ ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులుతీరారు. వీరిలో చాలామంది ప్రభుత్వ ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతున్నవారు, కోర్సులు పూర్తిచేసి ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు రాక ఇళ్లల్లోనే ఉంటున్నవారు ఉన్నారు. వీరంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసినట్టు చెబు తున్నారు. ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయకుండా లక్షలాది మంది నిరుద్యోగులకు సీఎం జగన్ అన్యాయం చేశారని, అందుకే బెంగళూరు నుంచి వచ్చి మరీ కూటమి అభ్యర్థులకు ఓటేశానని ప్రసన్నకుమార్ అనే యువ కుడు వెల్లడించాడు. ఉన్నత చదువులు పూర్తిచేసిన వారికి కూడా ఈ ప్రభుత్వం అవకాశాలను కల్పించలేక పోయిందని, చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే పరిశ్రమలు తీసుకువచ్చి ఇక్కడే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్న ఆలోచనతో కూటమికి ఓటేసేందుకు హైదరాబాద్ నుంచి వచ్చానని రాజేష్ అనే యువకుడు తెలిపాడు. తనలాగే ఎంతోమంది దూర ప్రాంతాల నుంచి వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నట్టు వివరించాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలపైనే తొలి సంతకం చేస్తానని ... మిగతా 6వ పేజీలో



రామ్‌నగర్ విశాఖ సేవాసదన్ స్కూల్లో సోమవారం ఉదయం బారులుతీరిన ఉన్న ఓటర్లు (ఫైల్ ఫొటో)

వైసీపీ సేవలో వలంటీర్లు

నగదు పంపిణీ మొదలు పోలింగ్ కేంద్రాలకు ఓటర్ల తరలింపు వరకూ కీలకంగా వ్యవహరించిన వైనం

- కొన్నిచోట్ల పోలింగ్ కేంద్రాల సమీపంలో ఉండి... అధికార పార్టీ అభ్యర్థులకు ఓటు వేయాలంటూ ప్రచారం
- ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత వలంటీర్లతో అభ్యర్థుల సమావేశాలు
- భారీగా కానుకలు



గొలుగొండలో పోలింగ్ బూత్ వద్ద వైసీపీ శిబిరంలో ఓటరు స్లిప్పులు అందిస్తున్న వలంటీర్లు (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ అభ్యర్థుల తరపున నగదు పంపిణీ మొదలు ఓటర్లను పోలింగ్ కేంద్రాల వద్దకు తీసుకువెళ్లడం వరకూ వార్డు వలంటీర్లు పలువురు కీలకంగా వ్యవహరించారు. కొందరు పోలింగ్ కేంద్రాలకు సమీపంలో ఉండి...తమకు పరిచయం ఉన్నవారితో అధికార పార్టీ అభ్యర్థులకు ఓటు వేయించేందుకు యత్నించారు.

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వార్డు/గ్రామ వలంటీర్ల వ్యవ స్థకు శ్రీకారం చుట్టింది. ప్రతి 50 నుంచి వంద ఇళ్లకు ఒకరు చొప్పున జిల్లాలో 11 వేల మంది వలంటీర్‌లను నియమించింది. వీరంతా ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారాన్ని తమ పరిధిలోని ప్రజలకు చేర వేయడంతోపాటు ఆయా పథకాలకు అర్హులైన వారిని గుర్తించి దరఖాస్తు చేయించడం, పెన్షన్ల పంపిణీ వంటి బాధ్యతలు నిర్వర్తించేవారు. దీంతో వలంటీర్లందరికీ తమ పరిధిలో నివాసం ఉంటున్నవారితో బాగా పరిచ యాలు ఏర్పడ్డాయి. ప్రతి ఇంట్లోని సభ్యుల వివరాలతోపాటు ప్రభుత్వం పట్ల వారి అభిప్రాయం ఎలా ఉందనే విషయాలపై సంపూర్ణ అవగాహన ఏర్పడింది. వీలుచిక్కినప్పుడల్లా ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడుతూ వైసీపీకి మద్దతు కూడగట్టేందుకు యత్నిస్తుండేవారు. వలంటీర్ల వ్యవహారంపై ఫిర్యాదులు అందడంతో ఎన్నికల విధులకు, ఆ సమయంలో సామాజిక పెన్షన్ల పంపిణీ వంటి ఇతర పనులకు దూరం గా ఉంచాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ నేపథ్యంలో తమకు వలంటీర్లు అనుకూలంగా పనిచేసే అవకాశం ఉండదని భావించిన వైసీపీ అభ్యర్థులు వ్యూహాత్మకంగా రాజీనామా చేసి, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందిగా ఒత్తిడి తెచ్చారు. దీంతో కొంతమంది స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఇలా రాజీనామా చేసిన వారితో పాటు కొద్దిమంది వలంటీర్లు ఎన్నికల సమయంలో వైసీపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు. పోలింగ్‌కు రెండు రోజులు ముందు అభ్యర్థుల తరఫున తమ ప్రాంతంలో చేపట్టిన డబ్బుల పంపిణీలో పాల్గొన్నారు. గతంలో పరిచయాలు ఉండడంతో ఇంటింటికీ వెళ్లి వారికష్ట సుఖాలు మాట్లాడిన తర్వాత డబ్బులు చేతిలో పెట్టారు. తటస్థ ఓటర్లను వైసీపీ అభ్యర్థికి ఓటేసేలా ప్రభావితం ... మిగతా 6వ పేజీలో

యూజీడీ బాదుడు

2011లో యూజీడీ చార్జీల వసూలుకు జీవీఎంసీ కౌన్సిల్ తీర్మానం

- అయినా ఇంతవరకూ వసూలు చేయని అధికారులు
- వైసీపీ అధికారంలోకి వచ్చాక యూజీడీ చార్జీలపై దృష్టి
- సివరేజ్ చార్జీలు చెల్లించాలంటూ తాజాగా డిమాండ్ నోటీసులు
- ఆస్తిపన్నుతో కలిపి యజమానులకు జారీ
- ప్రజలపై ఏటా రూ.40 కోట్లు భారం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆస్తి పన్ను పెంపు, చెత్త పన్ను విధింపుతో ఇప్పటికే ప్రజల నడ్డివిరిచిన జీవీఎంసీ తాజాగా సివరేజ్ చార్జీల పేరుతో భూగర్భ మురుగునీటి (యూజీడీ) కనెక్షన్ కలిగిన వారిపై అదనపు భారం మోపుతోంది. యూజీడీ చార్జీలు వసూలుకు పదమూడేళ్ల కిందట జీవీఎంసీ కౌన్సిల్ తీర్మానం చేసినప్పటికీ ఇంతవరకూ అమలు చేసేందుకు ఎవరూ సాహసించలేదు. కానీ ఆదాయం సమకూర్చుకోవడమే ధ్యేయంగా పెట్టుకున్న వైసీపీ ప్రభుత్వం యూజీడీ చార్జీలను వసూలుచేయాలని ఆదేశించడంతో అధికారులు నోటీసులు జారీచేస్తున్నారు.

నగర పరిధిలో యూజీడీ నెట్‌వర్క్ కలిగిన ప్రాంతాల్లో నివాస, నివాసే తర భవనాలకు జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులు సివరేజ్ కనె క్షన్లు ఇస్తున్నారు. గతంలో 85 వేలు యూజీడీ కనెక్షన్లు ఉండగా, పెందుర్తి, గాజువాక ప్రాంతాల్లో కూడా నెట్‌వర్క్‌ను విస్తరించడంతో వీటి సంఖ్య 12 లక్షలకు చేరి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. యూజీడీ సదు పాయం కల్పించినందుకు నివాస, నివాసేతర భవనాల నుంచి చార్జీలు వసూలు చేయాలని జీవీఎంసీ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు తయారుచేసిన ప్రతిపాదనను 2011 ఆగస్టు 17న అప్పటి మేయర్ పులుసు జనార్దనరావు అధ్యక్షతన జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదించింది. నీటి సరఫరాకు వసూలు చేస్తున్న చార్జీల్లో మూడో వంతు మొత్తాన్ని సివరేజ్ చార్జీ కింద వసూలు చేయాలని నిర్ణయించారు. అయితే దీనిపై ప్రజల్లో వ్యతిరేకత వస్తుందనే భావనతో అప్పటి కౌన్సిల్‌లోని సభ్యులు గానీ, అధికారులు గానీ అమలు చేయడానికి సాహసించలేదు. దీంతో ఆ ప్రతిపాదన మరుగునపడిపోయింది.

రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ, విద్యుత్ చార్జీలను పలుమార్లు పెంచింది. అలాగే నగరాల్లో ఆస్తి పన్ను పెంచడంతో పాటు చెత్తపై పన్ను విధించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీరుపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. చెత్త పన్నును చెల్లించేది లేదంటూ జీవీఎంసీ సిబ్బం దిపై తిరుగుబాటు కూడా చేశారు. ఇలాంటి పరిస్థితిలో ప్రజలపై కొత్తప న్నుల భారం మోపే ఆలోచన చేయడానికి ఎవరూ సాహసించరు. కానీ వైసీపీ ప్రభుత్వం మాత్రం దీనికి విరుద్ధంగా 2011లో జీవీఎంసీ చేసిన సివ రేజ్ చార్జీలు వసూలు తీర్మానం అమలు చేయాలని ఆదేశించినట్టు అధికా రులు చెబుతుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. దీని ప్రకారం గత ఏడాదే సివరేజ్ చార్జీలు చెల్లించాలంటూ అసెస్‌మెంట్ దారులకు నోటీసులు జారీచే యగా, ఈ ఏడాది అందరికీ ఆస్తి పన్నుతో కలిపి సివరేజ్ చార్జీలకు సంబం ధించిన డిమాండ్ నోటీస్ పంపించడం చర్చనీయాంశంగా మారింది. డిమాండ్ నోటీసులో ఆస్తిపన్నుతోపాటు సివరేజ్ చార్జీలు ఉండడం చూసి అసెస్‌మెంట్‌దారులు ... మిగతా 6వ పేజీలో

సంక్షోభంలో విశాఖ ఉక్కు

- నెల రోజులు దాటినా అందని బొగ్గు
- అదానీ పోర్టులో చిక్కుకుపోయిన రూ.600 కోట్ల నిల్వలు
- ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితి
- మార్చి విద్యుత్ బకాయిలు రూ.68.43 కోట్లు

భారీగా పడిపోయిన ఉత్పత్తి



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు సమస్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికి వదిలేశాయి. అదానీ గంగవరం పోర్టులో ఏప్రిల్ 12న నిర్వాసిత కార్మికులు చేపట్టిన సమ్మె నెల రోజులకు పైగా కొనసాగుతోంది. దీని ఫలితంగా స్టీల్ ప్లాంటుకు పోర్టు నుంచి బొగ్గు, లైమ్‌స్టోన్ సరఫరా నిలిచిపోయింది. ఎక్కడె క్కడి నుంచో రూ.600 కోట్ల అప్పులు తెచ్చి ఆస్ట్రేలియా, అమెరికా దేశాల నుంచి స్టీల్ ప్లాంటు యాజమాన్యం కోకింగ్ కోల్ తెప్పించుకుంటే అది పోర్టు లో చిక్కుకు పోయింది. స్టీల్‌ప్లాంటుకు నష్టం జరగకుండా బొగ్గు పంపాలను కుంటే అదానీకి నిమిషాలపై పని. కానీ కార్మికుల సమ్మెను సాకుగా చూపిం చి ప్రయోజనం పొందాలని ప్రయత్నించడం వల్ల చర్చలు కూడా సవ్యంగా నిర్వహించడం లేదు. స్టీల్ అధికారుల సంఘం హైకోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు తెచ్చినా వాటినీ పట్టించుకోవడం లేదు. సమస్యను దీర్ఘకాలంపా టు సాగదీసి విశాఖ స్టీల్‌ప్లాంటును నష్టాల్లో ముంచేయడానికి అన్ని శ క్తులూ తెర వెనుక నుంచి పనిచేస్తున్నాయని కార్మిక సంఘాలు ఆరోపిస్తు న్నాయి. జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ సమక్షంలో చర్చలు నిర్వహించాల ని కార్మికులు కోరుతుంటే...దానికి పోర్టు యాజమాన్యం చొరవ చూపడం లే దు. ఎన్నికల విధుల్లో ఉన్నందున కలెక్టర్, కమిషనర్ ఈ సమస్యను పట్టిం చుకోలేదంటే కొంతవరకు ఉక్కు కార్మిక సంఘాలు విశ్వసించాయి. ఇప్పుడు అన్ని రకాల పని ఒత్తిళ్లు తగ్గిపోయినా జిల్లా అధికారులు ప్లాంటు సమస్య పరిష్కారానికి ముందుకు రాకపోవడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

భారీగా పడిపోయిన ఉత్పత్తి

స్టీల్‌ప్లాంటులో నెలకు రూ.2,500 కోట్ల విలువైన ఉత్పత్తులు తయారవు తాయి. రోజుకు సగటున 20 వేల టన్నుల స్టీల్ తయారుచేస్తారు. బొగ్గు, ఇ తర ముడిపదార్థాలు అందుబాటులో లేకపోవడం వల్ల గత ఏప్రిల్ నెలలో రూ.1,250 కోట్ల విలువైన స్టీల్‌నే తయారుచేశారు. వివిధ వర్గాల నుంచి రూ.800 కోట్ల వరకు అడ్వాన్సులు తీసుకోవడంతో వారంతా 70 శాతానికి పై గా ఉత్పత్తులు తీసుకుపోయారు. స్టీల్ నిల్వలు కూడా పడిపోయాయి. మే నెలకు వచ్చేసరికి ఉత్పత్తి మరీ తగ్గిపోయింది. ఈ నెల 14వ తేదీ నాటికి 70 వేల టన్నులు మాత్రమే ఉత్పత్తి చేశారు. వాస్తవానికి వేయి కోట్ల రూ పాయలకుపైగా విలువైన ఉత్పత్తులు తయారు చేయాల్సి ఉండగా కేవలం రూ.370 కోట్ల విలువైన ఉత్పత్తులే తయారయ్యాయి. అదానీ పోర్టు కారణం గా స్టీల్‌ప్లాంటుకు వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. దీనికి బాధ్యత వహిస్తూ నష్టపరిహారం ఇవ్వాల్సి ఉన్నా...అది తనకు వర్తించదంటూ 'మె జ్యూర్' నోటీసు జారీచేసింది. ప్రకృతి కారణంగా జరిగే నష్టాలకు వర్తించే 'మెజ్యూర్'ను ఈ సమ్మెకు ఆపాదిస్తూ తాము నష్ట పరిహారం ఇవ్వబోమని అదానీ పోర్టు మొండికేసింది.

జీతాలు లేవు...విద్యుత్ బిల్లులు లేవు

సరైన ఉత్పత్తి, అమ్మకాలు లేకపోవడంతో ఏప్రిల్ నెల జీతాలు ఇప్పటివ రకు స్టీల్‌ప్లాంటు ఇవ్వలేకపోయింది. ఉద్యోగులు, కార్మికులు అందరికీ కలిపి నెలకు రూ.84 కోట్ల వరకు జీతాలుగా ఇవ్వాల్సి ఉంది. గత నెలలో కూడా చే తిలో నగదు నిల్వలు లేకపోవడంతో రెండు వాయిదాల్లో జీతాలు చెల్లించిం ది. ఈ నెల 15వ తేదీ వచ్చినా రూపాయి కూడా ఉద్యోగులకు ఇవ్వలేదు. ఇ దిలా ఉంటే విద్యుత్ బిల్లుల భారం పెరిగిపోయింది. మార్చి నెలకు సంబం ధించిన బిల్లు, డిమాండ్ చార్జీలు కలిపి రూ.68.43 కోట్లు బకాయి ఉందని, రెండు రోజుల్లో చెల్లించకపోతే సరఫరా నిలిపివేస్తామంటూ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ నోటీసు జారీ చేసింది. తక్షణమే కలెక్టర్, పోలీస్ క మిషనర్ కల్పించుకొని కార్మికులతో చర్చలు ఏర్పాటు చేసి, స్టీల్‌ప్లాంటుకు బొగ్గు, లైమ్‌స్టోన్ అందించే దిశగా చర్యలు చేపట్టాలని కార్మిక, ఉద్యోగ సం ఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్‌కు గుండెపోటు
పలు రైళ్లు రద్దు..మరికొన్ని రీషెడ్యూల్
- 6లో

నేటి నుంచి ఏపీ ఈఏపీసెట్

- 23వ తేదీ వరకూ నిర్వహణ



విశాఖపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీఈఏపీసెట్-2024) గురువారం నుంచి ప్రారంభం కానున్నది. ఈ నెల 16, 17 తేదీల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన పరీక్ష జరగనున్నది. ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి పరీక్ష 18, 19, 20, 21, 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్టు ఉన్నత విద్యా శాఖ తెలిపింది. ఇందుకోసం ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో నాలుగు (అనకాపల్లి, గాజువాక, ఆనందపురం, విశాఖపట్నం సిటీ) రీజనల్ సెంటర్లు ఏర్పాటుచేశారు. వీటి పరిధిలో ఎంపిక చేసిన కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నారు. అనకాపల్లి రీజనల్ సెంటర్ పరిధిలో ఇంజనీరింగ్ కోర్సుకు 845 మంది, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కోర్సుకు 368 మంది, రెండు కోర్సులకు 12 మంది కలిపి మొత్తం 1,225 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆనందపురం రీజనల్ సెంటర్ పరిధిలో ఇంజనీరింగ్ కోర్సుకు 1,793 మంది, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కోర్సులకు 772 మంది, రెండు కోర్సులకు కలిపి ఏడుగురు మొత్తం 2,572 మంది, గాజువాక ... మిగతా 6వ పేజీలో

పెరిగిన ఓటింగ్

2019 ఎన్నికలతో పోల్చితే 3.78 శాతం

- పశ్చిమంలో అత్యధికంగా 11.6 శాతం
- పెందుర్తిలో 0.28 శాతం తగ్గుదల
- 2019 పోలింగ్ 66.25%
- 2024లో పోలింగ్ 70.03%

నియోజకవర్గం	2024 పోలింగ్	2019 పోలింగ్	తేడా
భీమిలి	75.96 శాతం	73.9 శాతం	2.06 శాతం
విశాఖ తూర్పు	68.64 శాతం	64.73 శాతం	3.91 శాతం
విశాఖ దక్షిణం	63.42 శాతం	61.15 శాతం	2.27 శాతం
విశాఖ ఉత్తరం	64.63 శాతం	62.85 శాతం	1.78 శాతం
విశాఖ పశ్చిమ	69.78 శాతం	58.19 శాతం	11.6 శాతం
గాజువాక	69.83 శాతం	65.33 శాతం	4.49 శాతం
పెందుర్తి	74.44 శాతం	74.72 శాతం	0.28 శాతం
మొత్తం	70.03	66.25	3.78

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం జిల్లాలో ఓటింగ్ శాతం గతంతో పోల్చు కుంటే 3.78 శాతం పెరిగింది. 2019 ఎన్నికల్లో ఓటింగ్ శాతం 66.25 కాగా ఈసారి అది 70.03 శాతానికి పెరిగింది. ఈ సార్వ త్రిక ఎన్నికల్లో జిల్లాలో 14,09,116 మంది ఓటు హక్కు వినియోగించుకు న్నారు. వీరి కోసం 1,991 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. సాయంత్రం ఆరు గంటల లోపు క్యూలైన్లలో ఉన్నవారికి రాత్రి 12 గంటల వరకు ఓటు వేసే అవకాశం కల్పించారు. దీంతో ఓటింగ్ శాతం పెరిగింది. 2019 ఎన్నికల్లో మొత్తం ఓటర్లు 18,81,678 కాగా అందులో 12,46,529 ఓట్లు (66.25 శాతం) పోలయ్యాయి. ఈసారి 20,12,373 మంది ఓటర్లకు గాను 14,09,116 మంది (70.03 శాతం) ఓటు వేశారు. గత ఎన్నికల కంటే ఓటింగ్ శాతం 3.78 పెరిగింది. జిల్లా లోని పశ్చిమ నియోజకవర్గంలో అత్యధికంగా 11.6 శాతం ఓటింగ్ పెరి గింది. పెందుర్తి నియోజకవర్గంలో గతం కంటే 0.28 శాతం తగ్గింది.

కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్‌కు గుండెపోటు

విశాఖపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి): కింగ్ జార్జ్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్‌కు బుధవారం ఉదయం గుండెపోటు వచ్చింది. ఆస్పత్రిలో ఉండగానే ఆయనకు నొప్పి రావడంతో అప్రమత్తమైన అధికారులు క్యాజువాలిటీలో పేస్‌మేకర్ వేశారు. అనంతరం కేర్ ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. ప్రస్తుతం సూపరింటెండెంట్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. గురువారం సర్జరీ చేయనున్నట్టు తెలిసింది. ఇదిలావుంటే ఐదు రోజుల కిందట కేజీహెచ్‌లో వైసీపీ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ వ్యవహారంలో సూపరింటెండెంట్‌ను జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి వివరణ కోరినట్టు చెబుతున్నారు.

బాత్‌రూమ్‌లో కొండ చిలువ


బాత్‌రూమ్‌లో కొండచిలువ


కొండ చిలువతో అటవీ శాఖ సిబ్బంది

విశాఖపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి): నగర పరిధి ఆరిలోవలో గల ఒక ఇంట్లో కొండ చిలువ బుధవారం కలకలం సృష్టించింది. బాత్‌రూమ్ ఫ్రెజర్ ట్యాంకులోకి కొండ చిలువ వెళ్లగా, దాన్ని అటవీ శాఖ అధికారులు పట్టుకుని అడవిలో విడిచి పెట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆరిలోవ చివరి బస్టాపు ప్రాంతంలో ఒక మహిళ చిన్నారితో కలిసి నివాసం ఉంటోంది. మంగళవారం రాత్రి ఆమె చిన్నారితో కలిసి ఇంటి వరండాలో ఉండగా...కొండ చిలువ ఒకటి లోనికి వెళ్లడం గుర్తించింది. అదినేరుగా బాత్‌రూమ్‌లోకి వెళ్లడం, అప్పటికే రాత్రి సమ యం కావడంతో పక్కింట్లో నిద్రించింది. ఉదయాన్నే స్థానికుల సహాయంతో కొండ చిలువ అటవీ శాఖ అధికారులకు సమాచారం చేరవేసింది. అటవీ శాఖ సిబ్బంది అక్కడకు చేరుకుని బాత్‌రూమ్‌లోకి వెళ్లి పరిశీలించగా, ఫ్రెజర్ ట్యాంకులో ఉన్నట్టు గుర్తించి, ఆ కొండ చిలువను చాకచక్యంగా పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు.

పోలింగ్ సరళిపై కేకే రాజు ఆరా

సీతమ్మధార, మే 15 : ఈ నెల 13వ తేదీన జరిగిన ఎన్నికల్లో పోలింగ్ సరళిపై పార్టీ శ్రేణులతో ఉత్తర నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు బుధవారం పార్టీ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్ వారీగా గత ఎన్నికలు, ఈసారి మెజారిటీ వచ్చే బూత్‌లు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో వైసీపీ అఖండ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'ఉమెన్ ఎంపవర్‌మెంట్ సొసైటీ సేవలు అభినందనీయం

అక్కయ్యపాలెం, మే 14: ఎన్నికల ప్రచారంలో సహాయ సహకారాలందించిన ఉమెన్ ఎంపవర్‌మెంట్ సొసైటీ బృందానికి విశాఖ ఎంపీ వైసీపీ అభ్యర్థిని బొత్స ఝాన్సీ అభినందనలు తెలిపారు. రైల్వేన్యూకాలనీలోని ఓ హోటల్‌లో బుధవారం ఉయ్ సపోర్ట్ సక్సెస్ మీట్ జరిగింది. అనంతరం ఝాన్సీని సొసైటీ సభ్యులు సత్కరించారు. సొసైటీ సీఈవో మల్లాది నారాయణమూర్తి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైసీపీ స్పోక్స్ పర్సన్ కొండా రాజీవ్ గాంధీ, సొసైటీ కార్యదర్శి శ్రీలక్ష్మి, డైరెక్టర్లు కె.కృష్ణవేణి, రూప, నాగేశ్వరి పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవలు భేష్

జ్ఞానాపురం, మే 14: రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలను ప్రభుత్వం వినియోగించుకుంది. ఇందులో భాగంగా స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలకు చెందిన వలంటీర్లు ఎంపికయ్యారు. వారు ఎన్ఎస్ఎస్ కళాశాల ప్రోగ్రాం అధికారి కె.మాణిక్యకుమారి పర్యవేక్షణలో దక్షిణ నియోజకవర్గంలోని పలు పోలింగ్ బూత్‌లలో వారిని నియమించారు. వారు క్యూలైన్ల నిర్వహణ, పోలీసులకు సహకారం, వృద్ధులు పోలింగ్ బూత్‌లకు చేరేందుకు సహకారం అందించడం తదితర సేవలు నిర్వహించారు.

రాష్ట్రంలో అధికార మార్పు ఖాయం

▸▸ శాసనమండలి సభ్యులు దువ్వారపు.రామారావు

మురళీనగర్, మే 15 ; సార్వత్రిక ఎన్నికల్లో త్వరలో వెలువడనున్న తీర్పు రాష్ట్ర ప్రగతికి బాటలువేస్తుందని శాసనమండలి సభ్యులు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దువ్వారపు. రామారావు అన్నారు. బుధవారం ఈ మేరకు స్థానిక ఆయన నివాసంలో సమావేశమైన టీడీపీ, బీసీ నాయకులతో ఉద్దేశించి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో నమోదైన ఓటింగ్ శాతం శుభపరిణామన్నారు. ప్రజల నాడి కూటమి వైపే ఉందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పి.రవికుమార్, పార్టీ శ్రేణులతో కలసి కేక్ కట్ చేసి ముందస్తు సంబరాలు చేసుకున్నారు. విశాఖ ఎంపీగా శ్రీ భరత్ విజయం దిశగా ఏడు నియోజకవర్గాల్లో శ్రమించిన పార్టీ బీసీ వర్గాలు, జనసేన, బీజేపీ, టీడీపీ శ్రేణులకు ఆయన అభినందనలు తెలిపారు.


ఎమ్మెల్సీ రామారావుకు పుష్పగుచ్ఛమిస్తున్న బీసీ నాయకులు

కార్యక్రమంలో నాయకులు జి.అప్పారావు, ఎన్.పైడిరాజు, కనకమహాలక్ష్మి తదితరులు ఉన్నారు. శాసనమండలి సభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దువ్వారపు.రామారావు అభినందించారు.

పలు రైళ్లు రద్దు..మరికొన్ని రీషెడ్యూల్

విశాఖపట్నం, మే 15: విజయవాడ డివిజన్ పరిధిలో భద్రతా నిర్మాణ పనులు సాగుతున్న నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేసినట్టు వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈనెల 15 నుంచి 26వ తేదీ వరకు విశాఖ-విజయవాడ మధ్య రాకపోకలు సాగించే ఉదయ్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు (22701/22702), గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), రాజమండ్రి-విశాఖ (07466), విశాఖ-రాజమండ్రి (07467) రద్దు కాగా, విశాఖ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17240) ఈ నెల 16 నుంచి 27వ తేదీ వరకు రద్దు చేసినట్టు డీసీఎం పేర్కొన్నారు.

ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ రీ షెడ్యూల్

విశాఖ నుంచి లోకమాన్య తిలక్ టెర్మినల్ (ఎల్‌టీటీ) వెళ్లే 18519 నంబరు గల ఎక్స్‌ప్రెస్ రైలును సాంకేతిక కారణాల వల్ల బుధవారం (15న) రీ షెడ్యూల్ చేశారు. దీంతో బుధవారం రాత్రి 11.20 గంటలకు విశాఖ నుంచి వెళ్లాల్సిన ఈ రైలు, గురువారం ఉదయం 6.30 గంటలకు బయలుదేరుతుందని రైల్వే అధికారులు తెలిపారు. అలాగే విశాఖ-నాందేడు (20811) ఎక్స్‌ప్రెస్ రైలును కూడా బుధవారం రీ షెడ్యూల్ చేశారు. రాత్రి 8.00 గంటలకు విశాఖలో బయలుదేరాల్సిన ఈ రైలు రాత్రి 11.20 గంటలకు (రెండు గంటల 30 నిమిషాలు ఆలస్యంగా) బయలుదేరింది. వీటితోపాటు విశాఖ మీదుగా నడిచే తంబరం-సంత్రాగచ్చి అయోధ్య ఎక్స్‌ప్రెస్ (22842), సంత్రాగచ్చి-సికింద్రాబాద్ స్పెషల్ (07222), బ్రహ్మపూర్-సికింద్రాబాద్ స్పెషల్ (07036) రైళ్లను బుధవారం రీ షెడ్యూల్ చేసి నడిపించారు.

దువ్వాడ మీదుగా భువనేశ్వర్-యలహంక ప్రత్యేక రైలు

వేసవి ప్రయాణికుల సౌకర్యార్థం వయా దువ్వాడ మీదుగా భువనేశ్వర్-యలహంక మధ్య ప్రత్యేక రైలు ప్రవేశపెడుతున్నట్టు కె.సందీప్ తెలిపారు. 02811 నం బరు గల రైలు జూన్ ఒకటి నుంచి 29 వరకు ప్రతి శనివారం రాత్రి 7.15 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం తెల్లవారుజామున 1.53 గంటలకు దువ్వాడ చేరుతుంది. రాత్రి 11.55 గంటలకు యలహంక చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 02812 నంబరు గల రైలు జూన్ మూడు నుంచి జూలై ఒకటి వరకు ప్రతి సోమవరం ఉదయం 5.00 గంటలకు యలహంకలో బయలుదేరి మర్నాడు ఉదయం 4.30 గంటలకు దువ్వాడ చేరుతుంది. ఇక్కడ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12.15 గంటలకు భువనేశ్వర్ వెళుతుంది. ఈ సర్వీసులు కుర్దారోడ్డు, శ్రీకాకుళం రోడ్డు, రాజమండ్రి, విజయవాడ, ధర్మవరం మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

నేటి నుంచి ఒలుపు చందనం విక్రయాలు

సింహాచలం, మే 15: వరాహలక్ష్మీనృసింహస్వామి ఒలుపు చందనం విక్రయాలను గురువారం నుంచి ప్రారంభించనున్నట్టు ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి తెలిపారు. ఉదయం 9 నుంచి సింహగిరిపై ప్రత్యేక కౌంటరులో విక్రయాలు జరుగుతాయన్నారు. సుమారు 10 గ్రాములు బరువు ఉన్న చందనం ప్యాకెట్ రూ.10 చొప్పున అమ్మనున్నట్టు చెప్పారు. ఐదు రోజుల పాటు విక్రయాలు చేపడతామన్నారు.

శోభన్‌బాబు ఫ్యాన్స్ ఆధ్వర్యంలో చలివేంద్రం


చలివేంద్రం ప్రారంభిస్తున్న శోభన్‌బాబు ఫ్యాన్స్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్, మే 15: పాదచారుల కోసం చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు సిటీవైడ్ శోభన్‌బాబు ఫ్యాన్స్ ప్రతినిధులు తెలిపారు. డాబాగార్డెన్స్ శోభన్‌బాబు విగ్రహం వద్ద దివంగత శోభన్‌బాబు పెళ్లిరోజు పురస్కరించుకుని చలివేంద్రం ఏర్పాటు చేశారు. పాదచారులకు మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు.

బహుభాషా గ్రంథం ఆవిష్కరణ


గ్రంథం ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ,అధ్యాపకులు

జ్ఞానాపురం, మే 15: స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ద్వితీయ భాషావిభాగం ఆధ్వర్యంలో విభాగాధిపతి డాక్టర్ పీకే జయలక్ష్మి సంపాదకత్వంలో రచించిన సమాగమ్ బహుభాషా గ్రంథాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ఆవిష్కరించారు. 50 మంది అధ్యాపకులు వివిధ భారతీయ భాషల్లో విద్య, సాంకేతిక పదజాలం ప్రాధాన్యత అంశంపై రచించిన ఈ పుస్తకం రచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్. దీప్తిగౌరీనాయుడు, డి.కోటేశ్వరరావు, అనుపమ, మౌనమి, సుజాత, అనిత,ప్రమీల సాహితీ రంగంలో జయలక్ష్మి కృషిని ప్రశంసించారు.

'వైసీపీ పాలనతో విసిగిపోయిన ప్రజలు'

అక్కయ్యపాలెం, మే 14: అస్తవ్యస్త వైసీపీ పాలనతో విసిగిపోయిన ప్రజలు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కూటమి వైపే మొగ్గు చూపారని బీజేపీ గ్రేటర్ 26వ వార్డుఅధ్యక్షుడు కేవీ కుమార్ అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వివిధ రాష్ట్రాల్లో ఉన్న వారు కూడా విశాఖకు తరలి వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. అంతే కాకుండా దివ్యాంగులు, వృద్ధులు ఓట్లు వేశారన్నారు. ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతం కూడా బాగా పెరిగిందని తెలిపారు.

భోజనం ప్యాకెట్లు పంపిణీ


ఆహార ప్యాకెట్లు అందిస్తున్న శేషగిరిరావు

అక్కయ్యపాలెం, మే 14 : గ్రేటర్ 42వ వార్డు రైల్వేన్యూకాలనీలోని ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీసాయి ధ్యాన మందిరంలో వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు బుధవారం వృద్ధులు, అనాథలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 14 ఏళ్ల నుంచి ఆలయం ఆవరణలో నిత్యాన్నదానం జరుగుతుందని, దీన్ని గుర్తించిన ఇంటర్నేషనల్ వైశ్ ఫెడరేషన్ (ఐవీఎఫ్) ఆర్థిక సాయంతో రెండు కమ్యూనిటీ ఫ్రిడ్జ్‌లను రెండేళ్ల క్రితం అందించిందన్నారు. వీటి ద్వారా ద్వారా ఆ హారాన్ని 24 గంటల పాటు అందుబాటులో ఉంటుందని చెప్పారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి


గుమ్మడి మధు (ఫైల్)

కొమ్మాది, మే 15: చంద్రంపాలెం జాతీయ రహదారిపై లారీ, బైక్ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. పీఎంపాలెం సీఐ వై. రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం... కొమ్మాది సమీపంలోని సాయిరాం కాలనీలో నివసిస్తున్న గుమ్మడి మధు బుధవారం ద్విచక్ర వాహనం మీద నగరం నుంచి ఇంటికి వస్తుండగా అదే మార్గంలో విజయనగరం వైపు వెళుతున్న లారీ చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా వెనుక నుంచి ఢీకొంది. దీంతో మధు తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు మనోజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. కాగా మధు మధురవాడ పరిసర ప్రాంతంలో అందరికీ సుపరిచితుడు ఆయన సాయిరాం కాలనీలోని వినాయకుడి ఆలయం ధర్మకర్తగా ఉన్నారు. అతనికి సినీ హీరో దగ్గుపాటి వెంకటేష్ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. స్థానిక టీడీపీ నాయకుడిగానూ గుర్తింపు ఉంది. మధు మృతితో సాయిరాం కాలనీ ప్రాంతంలో విషాదం నెలకొంది. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కొమ్మాది, మే 15: విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన పీఎం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వై. రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. నందిక చిన్నా (27), భార్య కుమార్తెతో కలిసి కొమ్మాది దరి శ్రీనివాసనగర్‌లో ఉంటున్నాడు. రాడ్ బెండింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 4న శివశక్తినగర్‌లో ఒక భవనం వద్ద రాడ్ బెండింగ్ పనుల కోసం కింద నుంచి పైఅంతస్తుకు రాడ్‌లు తరలిస్తుండగా విద్యుత్ వైర్లకుతగలడంతో షాక్ గురై రెండవ ఫ్లోర్ నుంచి కిందకు పడిపోయాడు. దీంతో ఆయన ముఖానికి, తలకు తీవ్ర గాయాలు కావడంతో మధురవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య నందిక సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

పిల్లలు లేరని వివాహిత ఆత్మహత్య

కొమ్మాది, మే 15: పిల్లలు లేరన్న బాధతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన పీఎం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. కొమ్మాది దరి అమరావతి కాలనీలో బ్లాక్ నంబరు 29 గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎల్లా నాగమణి కుటుంబంతో కలిసి నివస్తోంది. ఆమె కుమార్తె సత్యవేణికి పదేళ్ల క్రితం విత్తనాల శ్రీనివాస్‌తో వివాహం చేశారు. కుమార్తె, అల్లుడు కూడా అదే కాలనీలో బ్లాక్ నంబరు 10 ఎఫ్.ఎఫ్1లో నివసిస్తున్నారు. శ్రీనివాస్ ఒక ప్రైవేటు సంస్థలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. మంగళవారం ఆయన డ్యూటీ నిమిత్తం మధ్యాహ్నం 2 గంటలకు బయటకు వెళ్లాడు. ఈమేరకు సత్యవేణికి రాత్రి 7 గంటల సమయంలో శ్రీనివాస్ ఫోన్ చేయగా ఎప్పటికీ లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి ఆమె తల్లి నాగమణికి ఫోన్ చేశాడు. ఆమె వెంటనే కుమార్తె ఇంటికి వెళ్లి తలుపు తట్టినా తీయకపోవడంతో స్థానికుల సహకారంతో తలుపులు తెరిచి చూసేసరికి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెంది ఉంది. నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడి మృతి

ఆరిలోవ, మే 15: ఆరిలోవలోని స్కిల్ డెవలెప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ సమీపంలో నాలుగు రోజుల క్రితం ఓ వృద్ధుడు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. అతన్ని ఓ మహిళ 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించగా బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు.

సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ


జోన్-1 ప్రాంతీయ జేడీ విజయ్ భాస్కర్

మహారాణిపేట, మే 15: బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ వారి ఆధ్వర్యంలో విజ్ఞాన శాస్త్రాన్ని ప్రమాణాల ఆధారంగా నేర్చుకోవడంపై ఉపాధ్యాయులకు బుధవారం పామ్ బీచ్ హోటల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్-1 ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ బీ విజయ్ భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన రీతిలో బోధనందించడంలో సైన్స్ ఉపాధ్యాయులు ముందుండాలని కోరారు. విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెం దిన బీఐఎస్ స్టాండర్డ్స్ క్లబ్‌లను కలిగి ఉన్న పాఠశాలలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయులకు ఈ శిక్షణ నిర్వహించారు. డిప్యూటీ డైరెక్టర్ డి.వివేక్ వర్ధన్ రెడ్డి, సెక్షన్ అఫీసర్ భావనారాయణ పాల్గొన్నారు.

వైజాగ్	: జగదాంబ AC DTS	విజయనగరం	: NCS విన్సాక్స్ AC DTS
వైజాగ్	: శరత్ AC DTS	బొబ్బిలి	: సాయిగణపతి AC DTS
వైజాగ్	: CMR PVR	పార్వతీపురం	: సౌభాగ్యశ్రీ AC DTS
వైజాగ్	: వరుణ్ PVR	పాలకొండ	: శ్రీరామ AC DTS
వైజాగ్	: చిత్రాలయ PVR	టెక్కలి	: అయోఘ్ AC DTS
104ఏరియా	: శ్రీలక్ష్మినరసింహా-1 AC DTS	కొత్తవలస	: రాజా-2 AC DTS
గోపాలపట్నం	: శాంతి AC DTS	శ్రీకాకుళం	: సరస్వతి AC DTS
గాజువాక	: శ్రీకన్యమహల్ AC DTS	నరసన్నపేట	: శ్రీలక్ష్మి AC DTS
గాజువాక	: CMR PVR	పాలకొండ	: వెంకటగిరి-1 AC DTS
అనకాపల్లి	: సత్యనారాయణ-1 AC DTS	చెట్లి	: సుదర్శన్ AC DTS
నర్సీపట్నం	: PVR శ్రీకన్య మాల్ AC DTS	సోంపేట	: శ్రీనివాస AC DTS
పాయకరావుపేట	: గౌతమ్ AC DTS	ఇచ్ఛాపురం	: మహేశ్వర AC DTS
తగరపువలస	: తాతా AC DTS	పిఠాపురం	: BMR AC DTS
మధురవాడ	: శ్రీకన్యసినీప్లెక్స్ AC DTS	గజపతినగరం	: శ్రీసూర్యమహల్ AC DTS
విజయనగరం	: శ్రీకృష్ణ AC DTS		

ఓటర్ల తిరుగు ప్రయాణానికి 14 ప్రత్యేక సర్వీసులు

ద్వారకాబస్‌స్టేషన్, మే 14 : ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి విశాఖ వచ్చిన ఓటర్ల తిరుగు ప్రయాణానికి ఆర్టీసీ విశాఖ రీజియన్ అధికారులు బుధవారం 14 ప్రత్యేక సర్వీసులు ఆపరేట్ చేశారు. ఉద్యోగ, వ్యాపార, విద్య, ఇతర వ్యవహారాల కోసం హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి ప్రాంతాల్లో ఉంటున్న విశాఖ జిల్లా వాసులు ఓటువేసేందుకు వివిధ రవాణా సాధనాల ద్వారా ఎన్నికల ముందే విశాఖ చేరుకున్నారు. సోమవారం ఓటు హక్కు వినియోగించుకుని మంగళ, బుధవారాల్లో తిరుగు ప్రయాణమయ్యారు. బుధవారం ఒక్కసారిగా ఎక్కువ మంది తిరుగు ప్రయాణం కావడం, షెడ్యూల్ సర్వీసుల సీటింగ్ కెపాసిటీకి మించిన విధంగా డిమాండ్ ఉండడంతో అధికారులు ప్రత్యేక సర్వీసులు ఆపరేట్ చేశారు. విజయవాడకు ప్రతి గంటకు, హైదరాబాద్‌కు రోజుకు 16 షెడ్యూల్ సర్వీసులు, రాజమండ్రికి ప్రతి అరగంటకు షెడ్యూల్ సర్వీసులు ఉన్నప్పటికీ వాటికి మించిన విధంగా ప్రయాణికుల డిమాండ్ ఉండడంతో విజయవాడకు 4, హైదరాబాద్‌కు 4, రాజమండ్రికి 6 ప్రత్యేక సర్వీసులు నడిపారు. గురువారం కూడా తిరుగు ప్రయాణికుల డిమాండ్ ఉండే అవకాశం ఉందని ఆర్టీసీ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, మే 15: నిర్వహణ పనులు నేపథ్యంలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహచలం నాయుడు తెలిపారు. సెయిల్ క్వార్టర్స్, పోస్ట్ ఆఫీసు ఏరియా, హెచ్‌బీ కాలనీ లాస్ట్ బస్టాప్, హెచ్‌బీ కాలనీ, కేఆర్ఎం కాలనీ, బానునగర్, చాకలిపేట, డ్రెడ్జింగ్ కార్పొరేషన్, సీఎమ్మార్, దుర్గానగర్ ఏరియాల్లో కరెంట్ సరఫరా ఉండదని చెప్పారు. వెంకోజీపాలెం, ఉమానగర్‌ప్రాంతాల్లో ఉదయం 10-30 నుంచి మధ్యాహ్నం 12-30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

అక్కయ్యపాలెం పరిధిలో..

అక్కయ్యపాలెం: నిర్వహణ పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహచలం నాయుడు తెలిపారు. టీఎస్ లే అవుట్, ఫుడెక్స్, రాఘవేంద్ర ఆస్పత్రి ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు.

ఎన్నికల సరళి చూసి ఓర్వలేకే వైసీపీ దాడులు

▸▸ టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ

మహారాణిపేట, మే 15: రాష్ట్రంలో ఎన్నికల సరళిని చూసి ఓర్వలేకనే వైసీపీ దాడులకు పాల్పడుతోందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతిలో టీడీపీ అభ్యర్థి పులపర్తి నానిపై జరిగిన దాడిని ఖండిస్తున్నామన్నారు. వైసీపీనేత చెవిరెడ్డి కుమారుడు చేసిన దౌర్జన్యం ప్రజాస్వామ్యానికే మచ్చ అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయితే, రాష్ట్రానికి ముప్పేనని చెప్పి ఎస్.కోటకుచెందిన ఓ వైసీపీ నేత కుమారుడు చంద్రబాబు కోసం ఓటు వేసేందుకు బెంగళూరు నుంచి రావడం వాస్తవ పరిస్థితులను తేటతెల్లం చేసిందని తెలిపారు. జగన్ తనకు వచ్చిన అవకాశాన్ని దుర్వినియోగం చేసుకున్నారని అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీ లన్నీ నెరవేర్చుతామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు గొంప సత్య నారాయణ, జిల్లా మీడియా కోఆర్డినేటర్ కె.గోపాలరెడ్డి పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులు క్లీన్ స్వీప్ తథ్యం

డాబాగార్డెన్స్, మే 15: ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాలతో పాటు ఉత్తరాంధ్రలోని కూటమి అభ్యర్థులు క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని తెలుగుశక్తి తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి. రామ్ అన్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా విశాఖలో ప్రమాణస్వీకారం చేయాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఇదే విషయమై టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు గండిబాబ్జీతో చర్చించినట్టు చెప్పారు. చంద్రబాబుకు ఈ విషయాన్ని తెలియజేయాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మండవ జ్యోతి, ఎన్.భార్గవి, బి. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


గండిబాబ్జీని కలిసిన తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్

ఎల్అండ్‌టీకి నౌకల నిర్మాణ బాధ్యత అప్పగింత అక్రమం

▸▸ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు

జగదాంబ కూడలి, మే 15: కేంద్ర రక్షణ రంగంలో వినియోగించే ఫ్లీట్ సపోర్టు నౌకల నిర్మాణ పనులను ఎల్అండ్‌టీ సంస్థకు కాకుండా హిందూస్థాన్‌షిప్‌యార్డ్ మాత్రమే చేపట్టాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీ హెచ్ నరసింగరావు అన్నారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రక్షణ రంగానికి చెందిన 5 ఫ్లీనట్ సపోర్టు నౌకలను రూ. 20 వేల కోట్లతో నిర్మించేందుకు విశాఖలోని హిందూస్థాన్ షిప్‌యార్డ్‌కు ఆర్డర్ ఇచ్చారన్నారు. షిప్‌యార్డ్ యజమాన్యం ఈఆర్డర్‌లో రెండు నౌకలను ఎల్అండ్‌టీ అప్పగించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. దేశంలోనే విశాఖ షిప్‌యార్డ్‌కు సహజసిద్ధమైన డ్రై డాక్‌లున్నాయని, ఇక్కడ సుమారు 7,500 వరకు పర్మినెంట్ నైపుణ్యత గల కార్మికులు పనిచేస్తున్నారన్నారు. 82 ఏళ్ల సుదీర్ఘ అనుభవంతో ప్రత్యేక గు ర్తిం పు కలిగిఉందన్నారు. అయినా, నౌకల నిర్మాణ పనులు ఎల్అండ్‌టీకి అప్పగించడం దుర్మార్గమని ఆయన అభివర్ణించారు. కేంద్రంలోని రక్షణ రంగ శాఖ తక్షణం ఈ అడ్డగోలు చర్యలను నిలుపుచేయాలని డిమాండ్ చేశారు. అలాగే, ఎల్అండ్‌టీ సంస్థకు మొత్తం 5 ఫ్లీట్ నౌకల నిర్మాణ పనుల అప్పగింతకు సీఎండీ పన్నుతున్నారని ఆరోపించారు. ప్రైవేట్ సంస్థలైన ఎల్అండ్‌టీ, ఎస్ఈడీఎస్ కొచ్చిన్ తదితర సంస్థలకు కట్టబెట్టిన ఆర్డర్లను వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆ ర్‌కేఎస్ రవికుమార్, ఉపాధ్యక్షుడు కేఎం కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరసింగరావు

వైసీపీ సేవలో వలంటీర్లు

... 5వ పేజీ తరువాయి

చేసేందుకు ప్రయత్నం చేశారు. అలాగే నగదు పంపిణీతో ఆగిపోకుండా పోలింగ్ రోజున ఓటర్లను ఇంటి నుంచి పోలింగ్ బూత్ వరకూ తీసుకువెళ్లడం, పోలింగ్ బూత్ వద్దకు వచ్చిన పరిచయస్తులను వైసీపీ అభ్యర్థికి ఓటు వేయాల్సిందిగా కోరడం కనిపించింది. వైసీపీ అభ్యర్థులు కూడా తమ నియోజకవర్గ పరిధిలో వలంటీర్లతో ఎన్నికలషెడ్యూల్ విడుదలైనప్పుడే సమావేశాలు ఏర్పాటుచేసి కానుకలు అందజేశారు. అదేవిధంగా డ్వాక్రా గ్రూపులను పర్యవేక్షించే యూసీడీ విభాగంలోని రీసోర్స్ పర్సన్లకు కూడా వైసీపీ అభ్యర్థులు కాసుల హారాలు అందజేసి తమ విజయానికి సహకరించాలని కోరినట్టు తెలిసింది.

పెల్లుబుకిన ప్రభుత్వ వ్యతిరేకత?

... 5వ పేజీ తరువాయి

చంద్రబాబునాయుడు హామీ ఇవ్వడంతో నూజివీడులో కోచింగ్ తీసుకుంటున్న 20 మంది వచ్చి కూటమి అభ్యర్థులకు ఓటేశామని సరిత అనే యువతి చెప్పింది. గడిచిన ఐదేళ్లలో రియల్ ఎస్టేట్ బాగా దెబ్బతిందని, వ్యాపారాలు తగ్గుముఖం పట్టడంతో వెంచర్లు వేయడమే మానేశామని నగరానికి చెందిన ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి పేర్కొన్నారు. అధికార పార్టీ నాయకులు గడిచిన ఐదేళ్లలో వ్యవహరించిన తీరు, న్యాయానికి, చట్టానికి విరుద్ధంగా చేపట్టిన అనేక కార్యక్రమాలు, నగర పరిధిలో ప్రతిపక్ష నాయకులకు సంబంధించిన ఆస్తులపై దాడులు వంటివి ఆందోళన కలిగించాయని,మరోసారి అధికారాన్ని కట్టబెడితే ఏం చేస్తారన్న భయంతో కూటమికి ఓటేశానని ఓ ప్రైవేటు కాలేజీ లెక్చరర్ పేర్కొన్నారు.

నిరుపేద వర్గాల్లోనూ...

గత ఎన్నికల్లో వైసీపీకి మద్దతుగా నిలిచిన రోజువారీ కూలీలు, భవన నిర్మాణ రంగ కార్మికులు, మాల్స్, ఇతర దుకాణాల్లో పనిచేసే చిరుద్యోగులు కూడా ఈసారి వైసీపీకి వ్యతిరేకంగా కనిపించారు. పెరిగిన ధరలు, విద్యుత్, ఆర్టీసీ చార్జీల పెంపు వంటి అంశాలు ఈ వర్గాలను వైసీపీకి వ్యతిరేకంగా ఓటేసేలా ప్రభావితం చేసినట్టు చెబుతున్నారు. నెలకు రూ.15 వేలు వేతనం ఇస్తున్నారని, ఆ మొత్తం ఇంటి అద్దె, నిత్యావసరాలకొనుగోలుకే సరిపోతోందని, బతకడం కష్టంగా ఉంటోందని రవి అనే ప్రైవేటు ఉద్యోగి వాపోయారు. కూటమి అధికారంలోకి వస్తే గ్యాస్ సిలిండర్ భారమైనా తగ్గుతుందని, తన భార్య కూడా వస్త్ర దుకాణంలో పని చేస్తోందని, ఆమెకు బస్‌చార్జీలుమిగులుతాయని కూటమికి ఓటేశామన్నారు. కూటమి ప్రవేశపెడతామన్న పథకాలు బాగున్నాయని,అందుకే ఓటేశానని లక్ష్మి అనే గృహిణి పేర్కొన్నారు. జగన్ వచ్చిన తరువాత భవన నిర్మాణ కార్మికులకు రూపాయి కూడా సాయం చేయలేదని, గత ఎన్నికల్లో జగన్ కోసం పది మందితో ఓట్లేయించానని, ఈ ఎన్నికల్లో 20 మందికి చెప్పి మరీ కూటమికి ఓట్లేసేలా చేశానని రామారావు అనే తాపీమేస్త్రీ పేర్కొన్నాడు.ఇలాఅన్నివర్గాల్లోనూ వైసీపీపై స్పష్టమైన వ్యతిరేకత కనిపించింది.

యూజీడీ బాదుడు

... 5వ పేజీ తరువాయి

అవాక్కవుతున్నారు. కొత్తగా సివరేజ్ చార్జీలు ఏమిటంటూ జీవీఎంసీ రెవెన్యూ విభాగం అధికారుల వద్దకు వెళ్లి ఆరా తీస్తున్నారు. ఇప్పటికే అనేక పేర్లతో పన్నుల భారం మోపిన వైసీపీ ప్రభుత్వం యూజీడీ పేరుతో కొత్తగా పన్ను వేయడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ఏటా రూ.40 కోట్లు భారం

జీవీఎంసీ విధిస్తున్న సివరేజ్ చార్జీల కారణంగా నగరవాసులపై ఏటా రూ.40 కోట్లు అదనపు భారం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కొళాయి చార్జీలో మూడో వంతుగా సివరేజ్ చార్జీ విధించాలని నిర్ణయించడంతో నీటి చార్జీలు రూపంలో వచ్చే ఆదాయంలో మూడో వంతు జీవీఎంసీకి సమకూరుతుంది. పరిశ్రమలకు ఇచ్చే బల్క్ కనెక్షన్లను మినహాయిస్తే నీటి సరఫరా చార్జీల రూపంలో జీవీఎంసీకి సెమీ బల్క్, వ్యక్తిగత కొళాయి కనెక్షన్ల ద్వారా ఏటా రూ.120 కోట్లు వరకూ సమకూరుతుంది. దీనిలో మూడో వంతు అంటే రూ.40 కోట్ల వరకూ ఉండవచ్చునని జీవీఎంసీ నీటిసరఫరా విభాగం అధికారులు అంచనా వేస్తున్నారు. ఆ మొత్తాన్ని ఇకపై ఏటా నగరవాసులు జీవీఎంసీకి చెల్లించాల్సి ఉంటుందన్నమాట.

నేటి నుంచి ఏపీ ఈఏపీసెట్

... 5వ పేజీ తరువాయి

రీజనల్ సెంటర్ పరిధిలో ఇంజనీరింగ్‌కు 10,131 మంది, ఫార్మసీ అండ్ అగ్రికల్చర్ కోర్సుకు 3,479 మంది, రెండు కోర్సులకు కలిపి 37 మంది కలిపి మొత్తం 13,647 మంది దరఖాస్తు చేశారు. అలాగే, విశాఖపట్నం రీజనల్ సెంటర్ పరిధిలో ఇంజనీరింగ్‌కు 20,502 మంది, ఫార్మసీ అండ్ అగ్రికల్చర్ కోర్సుకు 5,793 మంది, రెండింటికీ కలిపి 70 మంది...మొత్తం 26,365 మంది దరఖాస్తు చేసుకున్నారు.


వ్యర్థాలకు నిప్పు అంటించడంతో కమ్ముకున్న పొగ


ఆటోనగర్-కణితి రహదారిలో పేరుకుపోయిన చెత్తకుప్పలు

తరచూ వ్యర్థాలకు నిప్పు

దట్టమైన పొగ, భరించరాని దుర్వాసనతో పరిసర ప్రాంతాల ప్రజలు సతమతం

డంపింగ్ యార్డులుగా ఏపీఐఐసీ స్థలాలు మారుతున్న పట్టించుకోని అధికారులు

ఆటోనగర్, మే 15: పారిశ్రామిక వాడ ఆటోనగర్ ఎఫ్-బ్లాక్, గ్రీన్ సిటీ రహదారిని ఆనుకుని ఉన్న ప్రాంతంలో పేరుకుపోయిన వ్యర్థాల నుంచి రెండు రోజుల క్రితం హఠాత్తుగా అగ్నికీలలు ఎగసిపడ్డాయి. దీంతో ఈ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆటోనగర్ పరిశ్రమల నుంచి తరలిస్తున్న పారిశ్రామిక వ్యర్థాలను ఎఫ్-బ్లాక్‌లోని రోడ్డు పక్కన, గ్రీన్‌సిటీ సమీపంలోని ఆటోనగర్ పక్కన వేస్తుండడంతో తరచూ ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు పక్కన గల వ్యర్థాలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడం నిత్యకృత్యంగా మారుతున్నా ఏపీఐఐసీ ఐలా సిబ్బంది, పాలకవర్గ సభ్యులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వ్యర్థాల్లోని ప్లాస్టిక్ సామగ్రి, రసాయన పదార్థాలు అగ్నికి ఆహుతై తీవ్ర దుర్వాసనతో కూడిన పొగ వెలువడుతుండడం వల్ల ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని, దీనివల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పరిసర ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


చెత్తాచెదారంతో పాటు జంతు కళేబరాన్ని పడేసిన దృశ్యం

పరిస్థితి ఇలాగే కొనసాగితే శ్వాసకోస వ్యాధుల బారినపడాతమని భయందోళన చెందుతున్నారు. ఏపీఐఐసీ స్థలాలను పలువురు డంపింగ్ యార్డులుగా మార్చుతున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా డీ-బ్లాక్‌లో నిర్మాణం పూర్తి చేసుకున్న చెత్త డంపింగ్ యార్డును వినియోగంలోకి తీసుకురాకపోవడం వల్లే ఆటోనగర్ ప్రాంతం కాలుష్య కాసారంగా మారుతోందని వాపోతున్నారు.


కార్ల సర్వీసింగ్ కంపెనీ నిర్వాహకులతో మాట్లాడుతున్న దుల్ల రామునాయుడు, తదితరులు

రహదారిపై కార్లను తొలగించాలని ఆందోళన

అగనంపూడి, మే 15: జాతీయ రహదారి ఇ-మర్రిపాలెం బస్టాప్ కూడలిలో గల కార్ల సర్వీసింగ్ కంపెనీ ముందు ఇష్టానుసారంగా పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానికులు ఆందోళనకు దిగారు.

గేటు బయట ఇష్టారాజ్యంగా కార్లను పార్కింగ్ చేయడం వల్ల స్థానికంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని, అందువల్ల తక్షణమే కార్లను లోపల పెట్టుకోవాలంటూ జనసేన పార్టీ స్థానిక నాయకుడు దుల్ల రామునాయుడు కంపెనీ ప్రతినిధులతో వాగ్వాదానికి దిగారు. రహదారి స్థలంలో కార్లను ఎలా పార్కింగ్ చేస్తారని నిలదీశారు. సాయంత్రంలోగా పార్కింగ్ చేసిన కార్లను తొలగిస్తామని వారు హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

19న జూలో వ్యాసరచన పోటీలు

విశాఖపట్నం, మే 15 : నగరంలోని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల (జూ పార్కు)లో ఈ నెల 19న అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించనున్నట్టు క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు. బుధవారం ఆమె ఒక ప్రక టన విడుదల చేశారు. జూలోని బైస్కోపు సెంటర్‌లో ఆ ఉదయం 10 గంటల ఈ పోటీలు జరుగుతాయన్నారు. 1వ తరగతి నుంచి పిజి వరకు చదువుతున్న వారు పోటీల్లో పాల్గొనవచ్చునని తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, వ్యక్తిత్వ వికాసం పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆసక్తి గల వారు 789 363 2900 సెల్ నంబర్‌ను సంప్రతించాలని నందనీ సలారియా కోరారు.

సినిమా గైడ్

- **బాక్ :** జగదాంబ, శ్రీరామ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక)
- **ఆ ఒక్కటి అడక్కు :** మెలోడీ, సంగం, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత(శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), శ్రీకన్య సినీపోలీస్ , దుర్గ, (మధురవాడ).
- **ప్రసన్నవదనం :** శరత్, వెంకటేశ్వర-1, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),
- **శబరి :** వెంకటేశ్వర.
- **రత్నం :** అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** శారద, మోహిని (గాజువాక),
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా 22, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 36, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 34, బీరకాయలు 44, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 34, క్యాబేజీ 26, క్యారెట్ 36, దొండకాయలు 27, బంగాళదుంపలు 28, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 146, మునక్కాడలు (కిలో) 34, బరబాటి 50, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 96, గోరుచిక్కుడు 36, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 185, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 70, పొటల్స్ 40, కీరదోస 30, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 32, చిలగడదుంపలు 42, కంద 66, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, క్యాప్సికమ్ 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	135
ఫారం ధర	--	155
విత్ స్కిన్	--	280
స్కిన్‌లెస్	--	290

పూడికతో దుర్భరంగా మారిన చెరువులు

అడుగంటుతున్న భూగర్భ జలాలు

దశాబ్దాలు గడుస్తున్నా అభివృద్ధి చర్యలు శూన్యం

గోపాలపట్నం, మే 15: చెరువుల అభివృద్ధికి తగిన చర్యలు చేపట్టకపోవడంతో అవి పూడికతో నిండి దుర్భరంగా మారడంతో పాటు భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 89వ వార్డు పరిధి కొత్తపాలెం, తదితర గ్రామాల్లో సుమారు వంద ఎకరాల విస్తీర్ణంలో మూడు చెరువులు ఉన్నాయి. వీటిలో కొతపాలెం-వెంకటాపురం, కొత్తపాలెం-చంద్రనగర్ ప్రాంతాల్లో ఉన్న చెరువులు చాలా విస్తీర్ణంగా ఉంటాయి. సహజ సిద్ధంగా ఏర్పడిన ఈ చెరువుల్లో మూడు దశాబ్దాల క్రితం వరకూ నిత్యం జలకళ ఉట్టిపడేది. కానీ ఇప్పుడు ఈ చెరువుల పరిస్థితి దయనీయంగా మారింది. చెరువుల్లో పూడిక పేరుకుపోవడంతో పాటు గుర్రపుడెక్కాకు, తుప్పలు, డొంకలు పెరిగి అడవిని తలపిస్తున్నాయి. దీంతో రానురాను వీటిలో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టాయి. ఒకప్పుడు ఈ చెరువులకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో భూగర్భ జలాలు పుష్కలంగా ఉంటే ఇప్పుడు వేసవి సమయంలో నీరు అడుగంటిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తగ్గుముఖం పట్టిన భూగర్భ జలాలు

కొత్తపాలెం, ఎల్లపువానిపాలెంలో ఉన్న చెరువుల కారణంగా ఈ రెండు గ్రామాల్లో రెండు దశాబ్దాల క్రితం వరకు భూగర్భ జలాలు పుష్కలంగా ఉండేవి.


పూడికతో నిండిన వెంకటాపురం-కొత్తపాలెం గ్రామల పెద్ద చెరువు

అయితే కాలక్రమేణ చెరువులు పూడికతో నిండిపోవడంతో చెరువుల్లో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టాయి. గడిచిన మూడు దశాబ్దాల కాలంలో ఈ రెండు గ్రామాలో వేల సంఖ్యలో జనావాసాలు పెరిగాయి. పదుల సంఖ్యలో అపార్ట్ మెంట్లు వెలశాయి. ఒకప్పుడు ఇక్కడి ప్రజలు నీటి అవసరాల కోసం గ్రామంలోని మంచినీటి బావులపైనే ఆధారపడేవారు. కాలక్రమంలో ప్రతి ఇంటికి బోరు బావులు ఏర్పాటు చేసుకోవడం, అపార్ట్‌మెంట్లలో కూడా భారీగా బోర్ల తవ్వకాలు పెరగడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఒకప్పుడు ఈ ప్రాంతంలో భూ ఉపరితలానికి పది అడుగులు దిగువన ఉండే భూగర్భ జలాలు ఇప్పుడు వేసవి వచ్చిందంటే సుమారు 70 అడుగుల లోతుకు పోతున్నాయి. ఈ పరిస్థితిని చూసి గ్రామస్థులు ముందు ముందుకు పరిస్థితి ఇంకెలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు.

చెరువులను అభివృద్ధి చేయాలని వేడుకోలు

కొత్తపాలెం, ఎల్లపువానిపాలెం గ్రామాల్లోని చెరువుల్లో పూడికను పూర్తిగా తొలగించి అభివృద్ధి చేస్తే చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుంది. ఈ చెరువుల ఆధునీకరణపై అధికారులు దృష్టిసారిస్తే భవిష్యత్తులో నీటి అవసరాల కోసం ఈ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. అందువల్ల అధికారులు స్పందించి చెరువుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేటి నుంచి వెంకటాద్రిపై శ్రీవారి బ్రహ్మోత్సవాలు

20వ తేదీ వరకు నిర్వహణ

ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఆలయ వర్గాలు

పెందుర్తి, మే 15: ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 20వ తేదీ వరకు ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పలు పూజాది కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం విష్వక్సేన, అంకురార్పణ పూజలతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడతారు. 17వ తేదీ ఉదయం ధ్వజారోహణ, హోమం, సాయంత్రం శ్రీవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి లక్ష తులసి, మల్లికా పుష్పాలతో అర్చన చేస్తారు. 18న పద్మావతి, శ్రీనివాసుల పరిణయం, 19న వెంకన్న స్వామి తిరువీధి ఉత్సవం, రథోత్సవం, 20న వసంతోత్సవం, శ్రీచక్రస్నానం, శ్రీపుష్ప యాగం, పూర్ణాహుతితో బ్రహోత్సవాలు ముగుస్తాయి. అధిక సంఖ్యలో విచ్చేసే భక్తులు ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా ఆలయ వర్గాలు ఏర్పాట్లు చేశాయి.



బ్రహోత్సవాలకు ముస్తాబైన వెంకటాద్రి శిఖరంపై ఉన్న శ్రీవారి ఆలయం.. పక్కన పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి

లక్ష్మీపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

పెందుర్తి-రూరల్: జీవీఎంసీ 95వ వార్డు పరిధి లక్ష్మీపురం పోర్టు కాలనీలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి శ్రీవారి వార్షిక కల్యాణోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ నెల 23 వరకు ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా 19న సువర్చల సహిత అభయాంజనేయస్వామి కల్యాణం, 23న అన్న సమారాధన కార్యక్రమాలను చేపట్టనున్నట్టు పేర్కొన్నారు.


అమర్ జవాన్ అప్పలరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన కుటుంబ సభ్యులు. చిత్రంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, తదితరులు ఉన్నారు

అమర జవాన్ అప్పలరెడ్డికి నివాళి

పెదగంట్యాడ, మే 15: విధి నిర్వహణలో అమరుడైన ఆర్మీ నాయక్ పాల అప్పలరెడ్డికి ఆయన స్వగ్రామమైన దల్లివానిపాలెంలో ఆయన కుటుంబసభ్యులు, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పారిశ్రామిక ప్రాంత మాజీ సైనికులు బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయక్ అప్పలరెడ్డి విగ్రహాన్ని ఆయన కుటుంబ సభ్యులు ఆవిష్కరించారు. దేశ రక్షణ కోసం బోర్డర్‌లో ఆర్మీ నాయక్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో గతనెల 28న అక్కడే మృతి చెందారు. ఆయన జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు అప్పలరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, నాయకులు ఎం.పెంటయ్య, సైనికోద్యోగి దొమ్మేటి కనకరాజు, పలువురు మాజీసైనికులు, తదితరులు పాల్గొన్నారు.

జీతాల చెల్లింపులో తీవ్ర నిర్లక్ష్యం తగదు

ఇంటక్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు

ఉక్కుటౌన్‌షిప్, మే 15: ఉక్కు ఉద్యోగుల వేతనాల విషయంలో తీవ్ర నిర్లక్ష్యం జరగుతుందని ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. ప్లాంట్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం పలు సమస్యలపై ఇబ్బందులు పడుతున్నారని, కానీ యాజమాన్యం, గుర్తింపు సంఘం పట్టించుకోవడం లేదన్నారు. సంస్థలో ఉత్పత్తి తీసేందుకు కార్మిక వర్గం సిద్ధంగా ఉన్నప్పటికీ అందుకు తగ్గ వనరులను యాజమాన్యం సమకూర్చడం లేదన్నారు. ఇప్పటికైనా ఉక్కు యాజమాన్యం స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు కారు రమణ, కొవిరి అవతారం, బీఎంకే నాయక్, ఎస్‌ఏ నాయుడు, ఈశ్వరరావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ పంపిణీ చేసిన చెక్కులతో అభిమానులు. చిత్రంలో నల్లూరు సూర్యనారాయణ తదితరులు ఉన్నారు

కష్టాలలో ఉన్న అభిమానులకు అండగా ఉంటాం

జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ నల్లూరు సూర్యనారాయణ

కూర్మన్నపాలెం, మే 15: కష్టాలలో ఉన్న అభిమానులకు తాము అండగా ఉంటామని జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ నల్లూరు సూర్యనారాయణ అన్నారు. 86వ వార్డు పరిధి మాతృశ్రీనగర్‌లో బుధవారం రాత్రి స్టీల్ సిటీ జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్, టీమ్ తారక్ సభ్యులు, నందమూరి అభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉత్తరాంధ్ర జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ప్రతినిధులు నురగల నాయుడు, దుంగ శ్రీధర్‌లు మాట్లాడుతూ ఇటీవల 'సింహాద్రి' సినిమాను బెనిఫిట్ షో వేయడం ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్న ఎన్టీఆర్ అభిమానులు, వారి కుటుంబ సభ్యులకు, అనారోగ్యంతో బాధ పడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం అందజేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ఏడు లక్షల రూపాయలను ఉత్తరాంధ్రకు చెందిన పలువురికి చెక్కుల రూపంలో అందజేశారు. ఆపదలో ఉన్న అభిమానులకు చేయూతనిచ్చేందుకు తాము ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్, నందమూరి అభిమాన సంఘాల సభ్యులు రాము, ఆనంద్, గణపతి, శ్రీను, గోపి, చిన్న యాదవ్, అప్పన్న, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

ఆటోనగర్, మే 15: చినగంట్యాడ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున ఈ నెల 17వ తేదీ ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు జోన్-2 ఈఈ టీకె నాయుడు పేర్కొన్నారు. ఈ కారణంగా శ్రామిక నగర్, శ్రీనివాసనగర్, దత్త సాయి నగర్, కోర్టు ఏరియా, మోర్ సూపర్‌మార్కెట్, మెహర్ నగర్, ప్రశాంతినగర్, గొంతువానిపాలెం, కణితి రోడ్డు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కరణంరెడ్డి నరసింగరావు

గాజువాకలో 'పల్లా' విజయం తథ్యం

బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, మే 15: గాజువాక నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు విజయం తథ్యమని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడిచిన రెండు నెలల కాలంలో పల్లా శ్రీనివాసరావు విజయం కోసం బీజేపీ, టీడీపీ, జనసేన, నాయకులు, కార్యకర్తలు ఎంతో శ్రమించారన్నారు. వైసీపీపై కసితో అధిక సంఖ్యలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి, కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారం చేపడుతుందన్నారు. దీంతో రాష్ట్రం, దేశం అన్ని విధాల ముందుకు సాగుతుందన్నారు. ముఖ్యంగా ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధి చెందుతుందని కరణంరెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు సోంబాబు, ముసలయ్య, పద్మ, ప్రకాశ్, పైడిరాజు, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

అగనంపూడి, మే 15: ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జి.సుధాకరబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ గ్రూపునకు 88 సీట్లు, సీఈసీ గ్రూప్‌నకు 44 సీట్లు, హెచ్ఈసీ గ్రూపునకు 44 సీట్లు, ఒకేషనల్ గ్రూపులు ఎంపీహెచ్‌డబ్ల్యూ (మహిళలు) 30 సీట్లు, ఈఈటీ గ్రూప్ 30 సీట్లను భర్తీ చేస్తామన్నారు. ఈ నెల 22 నుంచి కళాశాలలో అడ్మిషన్లను ప్రారంభిస్తామని, ఆసక్తి గల అభ్యర్థులకు కళాశాల పని వేళల్లో దరఖాస్తులను అందజేయడం జరుగుతుందన్నారు పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ ఒకటో తేదీలోగా అందజేయాలని పేర్కొన్నారు. అనంతరం తరగతులు ప్రారంభమవుతాయన్నారు. అదేవిధంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు కూడా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, మరిన్ని వివరాలకు కళాశాలను సంప్రతించాలని ఆయన కోరారు.

కార్మికుల ఆందోళనలను పట్టించుకోని మోదీ

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ


దీక్షా శిబిరంలో ఆదినారాయణ, తదితరులు

కూర్మన్నపాలెం, మే 15: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వందలాది రోజులుగా ఆందోళనలు చేస్తున్నా ప్రధాని మోదీకి చీమకుట్టినట్టైనా లేదని, ఆయన హయాంలో రాష్ట్రానికి చేసిందేమీ లేదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1,189వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ తొమ్మిదేళ్ల పాలనలో ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారన్నారు. ఇప్పటికైనా ఉక్కు ప్రైవేటీకరణ యోచనను విరమించాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టడమే మోదీ లక్ష్యంగా మారిందని మండిపడ్డారు. ప్రజలంతా ఐక్యంగా ఉంటేనే దేశ సంపదను పరిరక్షించుకోవడం జరుగుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసి నష్టాలను సాకుగా చూపడానికి కేంద్రం చేస్తున్న యత్నాలకు స్థానిక నాయకులు సహకరించడం దారుణమన్నారు. పలువురు నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

'దిశ దివ్యాంగ్ సురక్ష'కు నాలుగు ఫిర్యాదులు

విశాఖపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం నగర పోలీస్ కమిషనరేట్‌లో బుధవారం నిర్వహించిన దిశ దివ్యాంగ్ సురక్ష టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌కు నాలుగు ఫిర్యాదులు అందాయి. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా రెండు, 15వ తేదీల్లో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దివ్యాంగుల సైన్ లాగ్వేజ్ తెలి సిన మహిళా కానిస్టేబుల్ ద్వారా సీపీ రవిశంకర్ అయ్యన్నార్ నేరుగా బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. తాను తీసుకున్న ఫైనాన్స్‌కు సంబంధించి ఈఎంఐ లను తప్పుగా తన వద్ద నుంచి రాబడుతున్నారని ఒక బాధితురాలు ఫోన్ చేయగా, మరొకరు తనను ప్రేమించిన యువకుడు పెళ్లికి నిరాకరిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. మిగిలిన ఇద్దరు తమ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నందుకు సీపీకి కృతజ్ఞతలు తెలిపారు.


ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీపీ

పోలింగ్ సరళిపై కూటమి లీగల్ సెల్ న్యాయవాదుల సమీక్ష


సమావేశంలో పాల్గొన్న కూటమి లీగల్ సెల్ న్యాయవాదులు

విశాఖపట్నం, మే 15 : రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి లీగల్ సెల్ న్యాయవాదులు అభ్యర్థుల విజయానికి కీలక పాత్ర పోషించారని విశాఖపట్నం కూటమి లీగల్ సెల్ అధ్యక్షుడు బత్తిన రాజశేఖర్ పేర్కొన్నారు. లీగల్ సెల్ కార్యాలయంలో బుధవారం జరిగిన లీగల్ సెల్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చేనెల 4న జరిగే ఓట్ల కౌంటింగ్‌లో తీసుకోవలసిన జాగ్రత్తలను లీగల్ సెల్ న్యాయవాదులకు వివరించారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు జె. పృథ్వీరాజ్, టీడీపీ ప్రధాన కార్యదర్శి పతివాడ గిరిధర్, ఉపాధ్యక్షుడు కన్నూరు కిరణ్‌కుమార్, యర్ర రేవతి, తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులకు యాజమాన్యమే జీతాలు చెల్లించాలి'

ఉక్కుటౌన్‌షిప్, మే 15: స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికులకు కొంతమంది కాంట్రాక్టర్లు సరిగ్గా జీతాలు చెల్లించడం లేదని, అందువల్ల వారికి యాజమాన్యమే జీతాలు చెల్లించాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. ప్లాంట్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంతమంది కాంట్రాక్టర్లు పీఎఫ్, ఈఎస్ఐ సరిగ్గా చెల్లించడం లేదన్నారు. ఇటువంటి కాంట్రాక్టర్లపై యాజమాన్యం చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికుల ప్రమాద బీమా రూ.20లక్షలకు పెంచాలన్నారు. సమావేశంలో నాయకులు సింహాద్రి, నరేంద్ర, చీపురుపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఐటీఐలో రూ.34 లక్షలతో అభివృద్ధి పనులు

గాజువాక, మే 15: ఇక్కడి స్టీల్ సిటీ ఐటీఐలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు గాను కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ ముందుకొచ్చింది. ఈ మేరకు బుధవారం కలెక్టర్ మల్లికార్జునను సంస్థ వైస్ ప్రెసిడెంట్, మ్యాన్‌ఫ్యాక్చరింగ్ హెడ్ ఎం.జ్ఞానసుందరం నేతృత్వంలో పలువురు అధికారులు కలిసి ఆమోదపత్రాన్ని అందజేశారు. ఈ నిధులతో కంప్యూటర్ ల్యాబ్ ఆధునీకరణ, 25 కంప్యూటర్లు, టేబుళ్లు, కుర్చీలు ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమంలో హెచ్ఆర్ హెడ్ ఆర్.శ్రీనివాసరావు, డీఎం (సీఎస్ఆర్) ఎస్.వెంకటరమణ, ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్‌కు గుండెపోటు

విశాఖపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి): కింగ్ జార్జ్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్‌కు బుధవారం ఉదయం గుండెపోటు వచ్చింది. ఆస్పత్రిలో ఉండగానే ఆయనకు నొప్పి రావడంతో అప్రమత్తమైన అధికారులు క్యాజువాలిటీలో పేస్‌మేకర్ వేశారు. అనంతరం కేర్ ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. ప్రస్తుతం సూపరింటెండెంట్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. గురువారం సర్జరీ చేయనున్నట్టు తెలిసింది. ఇదిలావుంటే ఐదు రోజుల కిందట కేజీహెచ్‌లో వైసీపీ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ వ్యవహారంలో సూపరింటెండెంట్‌ను జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి వివరణ కోరినట్టు చెబుతున్నారు.

బాత్‌రూమ్‌లో కొండ చిలువ


బాత్‌రూమ్‌లో కొండచిలువ


కొండ చిలువతో అటవీ శాఖ సిబ్బంది

విశాఖపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి): నగర పరిధి ఆరిలోవలో గల ఒక ఇంట్లో కొండ చిలువ బుధవారం కలకలం సృష్టించింది. బాత్‌రూమ్ ఫ్రెజర్ ట్యాంకులోకి కొండ చిలువ వెళ్లగా, దాన్ని అటవీ శాఖ అధికారులు పట్టుకుని అడవిలో విడిచి పెట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆరిలోవ చివరి బస్టాపు ప్రాంతంలో ఒక మహిళ చిన్నారితో కలిసి నివాసం ఉంటోంది. మంగళవారం రాత్రి ఆమె చిన్నారితో కలిసి ఇంటి వరండాలో ఉండగా...కొండ చిలువ ఒకటి లోనికి వెళ్లడం గుర్తించింది. అదినేరుగా బాత్‌రూమ్‌లోకి వెళ్లడం, అప్పటికే రాత్రి సమ యం కావడంతో పక్కింట్లో నిద్రించింది. ఉదయాన్నే స్థానికుల సహాయంతో కొండ చిలువ అటవీ శాఖ అధికారులకు సమాచారం చేరవేసింది. అటవీ శాఖ సిబ్బంది అక్కడకు చేరుకుని బాత్‌రూమ్‌లోకి వెళ్లి పరిశీలించగా, ఫ్రెజర్ ట్యాంకులో ఉన్నట్టు గుర్తించి, ఆ కొండ చిలువను చాకచక్యంగా పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు.

పోలింగ్ సరళిపై కేకే రాజు ఆరా

సీతమ్మధార, మే 15 : ఈ నెల 13వ తేదీన జరిగిన ఎన్నికల్లో పోలింగ్ సరళిపై పార్టీ శ్రేణులతో ఉత్తర నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు బుధవారం పార్టీ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్ వారీగా గత ఎన్నికలు, ఈసారి మెజారిటీ వచ్చే బూత్‌లు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో వైసీపీ అఖండ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'ఉమెన్ ఎంపవర్‌మెంట్ సొసైటీ సేవలు అభినందనీయం

అక్కయ్యపాలెం, మే 14: ఎన్నికల ప్రచారంలో సహాయ సహకారాలందించిన ఉమెన్ ఎంపవర్‌మెంట్ సొసైటీ బృందానికి విశాఖ ఎంపీ వైసీపీ అభ్యర్థిని బొత్స ఝాన్సీ అభినందనలు తెలిపారు. రైల్వేన్యూకాలనీలోని ఓ హోటల్‌లో బుధవారం ఉయ్ సపోర్ట్ సక్సెస్ మీట్ జరిగింది. అనంతరం ఝాన్సీని సొసైటీ సభ్యులు సత్కరించారు. సొసైటీ సీఈవో మల్లాది నారాయణమూర్తి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైసీపీ స్పోక్స్ పర్సన్ కొండా రాజీవ్ గాంధీ, సొసైటీ కార్యదర్శి శ్రీలక్ష్మి, డైరెక్టర్లు కె.కృష్ణవేణి, రూప, నాగేశ్వరి పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సేవలు భేష్

జ్ఞానాపురం, మే 14: రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల్లో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల సేవలను ప్రభుత్వం వినియోగించుకుంది. ఇందులో భాగంగా స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలకు చెందిన వలంటీర్లు ఎంపికయ్యారు. వారు ఎన్‌ఎస్‌ఎస్ కళాశాల ప్రోగ్రాం అధికారి కె.మాణిక్యకుమారి పర్యవేక్షణలో దక్షిణ నియోజకవర్గంలోని పలు పోలింగ్ బూత్‌లలో వారిని నియమించారు. వారు క్యూలైన్ల నిర్వహణ, పోలీసులకు సహకారం, వృద్ధులు పోలింగ్ బూత్‌లకు చేరేందుకు సహకారం అందిండం తదితర సేవలు నిర్వహించారు.

రాష్ట్రంలో అధికార మార్పు ఖాయం

» శాసనమండలి సభ్యులు దువ్వారపు.రామారావు

మురళీనగర్, మే 15 ; సార్వత్రిక ఎన్నికల్లో త్వరలో వెలువడనున్న తీర్పు రాష్ట్ర ప్రగతికి బాటలువేస్తుందని శాసనమండలి సభ్యులు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దువ్వారపు. రామారావు అన్నారు. బుధవారం ఈ మేరకు స్థానిక ఆయన నివాసంలో సమావేశమైన టీడీపీ, బీసీ నాయకులతో ఉద్దేశించి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో నమోదైన ఓటింగ్ శాతం శుభపరిణామన్నారు. ప్రజల నాడి కూటమి వైపే ఉందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పి.రవికుమార్, పార్టీ శ్రేణులతో కలసి కేక్ కట్ చేసి ముందస్తు సంబరాలు చేసుకున్నారు. విశాఖ ఎంపీగా శ్రీ భరత్ విజయం దిశగా ఏడు నియోజకవర్గాల్లో శ్రమించిన పార్టీ బీసీ వర్గాలు, జనసేన, బీజేపీ, టీడీపీ శ్రేణులకు ఆయన అభినందనలు తెలిపారు.


ఎమ్మెల్సీ రామారావుకు పుష్పగుచ్ఛమిస్తున్న బీసీ నాయకులు

కార్యక్రమంలో నాయకులు జి.అప్పారావు, ఎన్.పైడిరాజు, కనకమహాలక్ష్మి తదితరులు ఉన్నారు. శాసనమండలి సభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దువ్వారపు.రామారావు అభినందించారు.

పలు రైళ్లు రద్దు..మరికొన్ని రీషెడ్యూల్

విశాఖపట్నం, మే 15: విజయవాడ డివిజన్ పరిధిలో భద్రతా నిర్మాణ పనులు సాగుతున్న నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేసినట్టు వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈనెల 15 నుంచి 26వ తేదీ వరకు విశాఖ-విజయవాడ మధ్య రాకపోకలు సాగించే ఉదయ్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు (22701/22702), గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), రాజమండ్రి-విశాఖ (07466), విశాఖ-రాజమండ్రి (07467) రద్దు కాగా, విశాఖ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17240) ఈ నెల 16 నుంచి 27వ తేదీ వరకు రద్దు చేసినట్టు డీసీఎం పేర్కొన్నారు.

ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ రీ షెడ్యూల్

విశాఖ నుంచి లోకమాన్య తిలక్ టెర్మినల్ (ఎల్‌టీటీ) వెళ్లే 18519 నంబరు గల ఎక్స్‌ప్రెస్ రైలును సాంకేతిక కారణాల వల్ల బుధవారం (15న) రీ షెడ్యూల్ చేశారు. దీంతో బుధవారం రాత్రి 11.20 గంటలకు విశాఖ నుంచి వెళ్లాల్సిన ఈ రైలు, గురువారం ఉదయం 6.30 గంటలకు బయలుదేరుతుందని రైల్వే అధికారులు తెలిపారు. అలాగే విశాఖ-నాందేడు (20811) ఎక్స్‌ప్రెస్ రైలును కూడా బుధవారం రీ షెడ్యూల్ చేశారు. రాత్రి 8.00 గంటలకు విశాఖలో బయలుదేరాల్సిన ఈ రైలు రాత్రి 11.20 గంటలకు (రెండు గంటల 30 నిమిషాలు ఆలస్యంగా) బయలుదేరింది. వీటితోపాటు విశాఖ మీదుగా నడిచే తంబరం-సంత్రాగచ్చి అయోధ్య ఎక్స్‌ప్రెస్ (22842), సంత్రాగచ్చి-సికింద్రాబాద్ స్పెషల్ (07222), బ్రహ్మపూర్-సికింద్రాబాద్ స్పెషల్ (07036) రైళ్లను బుధవారం రీ షెడ్యూల్ చేసి నడిపించారు.

దువ్వాడ మీదుగా భువనేశ్వర్-యలహంక ప్రత్యేక రైలు

వేసవి ప్రయాణికుల సౌకర్యార్థం వయా దువ్వాడ మీదుగా భువనేశ్వర్-యలహంక మధ్య ప్రత్యేక రైలు ప్రవేశపెడుతున్నట్టు కె.సందీప్ తెలిపారు. 02811 నం బరు గల రైలు జూన్ ఒకటి నుంచి 29 వరకు ప్రతి శనివారం రాత్రి 7.15 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం తెల్లవారుజామున 1.53 గంటలకు దువ్వాడ చేరుతుంది. రాత్రి 11.55 గంటలకు యలహంక చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 02812 నంబరు గల రైలు జూన్ మూడు నుంచి జూలై ఒకటి వరకు ప్రతి సోమవరం ఉదయం 5.00 గంటలకు యలహంకలో బయలుదేరి మర్నాడు ఉదయం 4.30 గంటలకు దువ్వాడ చేరుతుంది. ఇక్కడ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12.15 గంటలకు భువనేశ్వర్ వెళుతుంది. ఈ సర్వీసులు కుర్దారోడ్డు, శ్రీకాకుళం రోడ్డు, రాజమండ్రి, విజయవాడ, ధర్మవరం మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

నేటి నుంచి ఒలుపు చందనం విక్రయాలు

సింహాచలం, మే 15: వరాహలక్ష్మీనృసింహస్వామి ఒలుపు చందనం విక్రయాలను గురువారం నుంచి ప్రారంభించనున్నట్టు ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి తెలిపారు. ఉదయం 9 నుంచి సింహగిరిపై ప్రత్యేక కౌంటరులో విక్రయాలు జరుగుతాయన్నారు. సుమారు 10 గ్రాములు బరువు ఉన్న చందనం ప్యాకెట్ రూ.10 చొప్పున అమ్మనున్నట్టు చెప్పారు. ఐదు రోజుల పాటు విక్రయాలు చేపడతామన్నారు.

శోభన్‌బాబు ఫ్యాన్స్ ఆధ్వర్యంలో చలివేంద్రం


చలివేంద్రం ప్రారంభిస్తున్న శోభన్‌బాబు ఫ్యాన్స్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్, మే 15: పాదచారుల కోసం చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు సిటీవైడ్ శోభన్‌బాబు ఫ్యాన్స్ ప్రతినిధులు తెలిపారు. డాబాగార్డెన్స్ శోభన్‌బాబు విగ్రహం వద్ద దివంగత శోభన్‌బాబు పెళ్లిరోజు పురస్కరించుకుని చలివేంద్రం ఏర్పాటు చేశారు. పాదచారులకు మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు.

బహుభాషా గ్రంథం ఆవిష్కరణ


గ్రంథం ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ,అధ్యాపకులు

జ్ఞానాపురం, మే 15: స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ద్వితీయ భాషావిభాగం ఆధ్వర్యంలో విభాగాధిపతి డాక్టర్ పీకే జయలక్ష్మి సంపాదకత్వంలో రచించిన సమాగమ్ బహుభాషా గ్రంథాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ఆవిష్కరించారు. 50 మంది అధ్యాపకులు వివిధ భారతీయ భాషల్లో విద్య, సాంకేతిక పదజాలం ప్రాధాన్యత అంశంపై రచించిన ఈ పుస్తకం రచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్. దీప్తిగౌరీనాయుడు, డి.కోటేశ్వరరావు, అనుపమ, మౌనమి, సుజాత, అనిత,ప్రమీల సాహితీ రంగంలో జయలక్ష్మి కృషిని ప్రశంసించారు.

'వైసీపీ పాలనతో విసిగిపోయిన ప్రజలు'

అక్కయ్యపాలెం, మే 14: అస్తవ్యస్త వైసీపీ పాలనతో విసిగిపోయిన ప్రజలు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కూటమి వైపే మొగ్గు చూపారని బీజేపీ గ్రేటర్ 26వ వార్డుఅధ్యక్షుడు కేవీ కుమార్ అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వివిధ రాష్ట్రాల్లో ఉన్న వారు కూడా విశాఖకు తరలి వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. అంతే కాకుండా దివ్యాంగులు, వృద్ధులు ఓట్లు వేశారన్నారు. ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతం కూడా బాగా పెరిగిందని తెలిపారు.

భోజనం ప్యాకెట్లు పంపిణీ


ఆహార ప్యాకెట్లు అందిస్తున్న శేషగిరిరావు

అక్కయ్యపాలెం, మే 14 : గ్రేటర్ 42వ వార్డు రైల్వేన్యూకాలనీలోని ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీసాయి ధ్యాన మందిరంలో వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు బుధవారం వృద్ధులు, అనాథలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 14 ఏళ్ల నుంచి ఆలయం ఆవరణలో నిత్యాన్నదానం జరుగుతుందని, దీన్ని గుర్తించిన ఇంటర్నేషనల్ వైశ్ ఫెడరేషన్ (ఐవీఎఫ్) ఆర్థిక సాయంతో రెండు కమ్యూనిటీ ఫ్రిడ్జ్‌లను రెండేళ్ల క్రితం అందించిందన్నారు. వీటి ద్వారా ద్వారా ఆ హారాన్ని 24 గంటల పాటు అందుబాటులో ఉంటుందని చెప్పారు.

ఓటర్ల తిరుగు ప్రయాణానికి 14 ప్రత్యేక సర్వీసులు

ద్వారకాబస్‌స్టేషన్, మే 14 : ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి విశాఖ వచ్చిన ఓటర్ల తిరుగు ప్రయాణానికి ఆర్టీసీ విశాఖ రీజియన్ అధికారులు బుధవారం 14 ప్రత్యేక సర్వీసులు ఆపరేట్ చేశారు. ఉద్యోగ, వ్యాపార, విద్య, ఇతర వ్యవహారాల కోసం హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి ప్రాంతాల్లో ఉంటున్న విశాఖ జిల్లా వాసులు ఓటువేసేందుకు వివిధ రవాణా సాధనాల ద్వారా ఎన్నికల ముందే విశాఖ చేరుకున్నారు. సోమవారం ఓటు హక్కు వినియోగించుకుని మంగళ, బుధవారాల్లో తిరుగు ప్రయాణమయ్యారు. బుధవారం ఒక్కసారిగా ఎక్కువ మంది తిరుగు ప్రయాణం కావడం, షెడ్యూల్ సర్వీసుల సీటింగ్ కెపాసిటీకి మించిన విధంగా డిమాండ్ ఉండడంతో అధికారులు ప్రత్యేక సర్వీసులు ఆపరేట్ చేశారు. విజయవాడకు ప్రతి గంటకు, హైదరాబాద్‌కు రోజుకు 16 షెడ్యూల్ సర్వీసులు, రాజమండ్రికి ప్రతి అరగంటకు షెడ్యూల్ సర్వీసులు ఉన్నప్పటికీ వాటికి మించిన విధంగా ప్రయాణికుల డిమాండ్ ఉండడంతో విజయవాడకు 4, హైదరాబాద్‌కు 4, రాజమండ్రికి 6 ప్రత్యేక సర్వీసులు నడిపారు. గురువారం కూడా తిరుగు ప్రయాణికుల డిమాండ్ ఉండే అవకాశం ఉందని ఆర్టీసీ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, మే 15: నిర్వహణ పనులు నేపథ్యంలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహచలం నాయుడు తెలిపారు. సెయిల్ క్వార్టర్స్, పోస్ట్ ఆఫీసు ఏరియా, హెచ్‌బీ కాలనీ లాస్ట్ బస్టాప్, హెచ్‌బీ కాలనీ, కేఆర్‌ఎం కాలనీ, భానునగర్, చాకలిపేట, డ్రెడ్జింగ్ కార్పొరేషన్, సీఎమ్మార్, దుర్గానగర్ ఏరియాల్లో కరెంట్ సరఫరా ఉండదని చెప్పారు. వెంకోజీపాలెం, ఉమానగర్‌ప్రాంతాల్లో ఉదయం 10-30 నుంచి మధ్యాహ్నం 12-30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

అక్కయ్యపాలెం పరిధిలో..

అక్కయ్యపాలెం: నిర్వహణ పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహచలం నాయుడు తెలిపారు. బీఎస్ లే అవుట్, ఫుడెక్స్, రాఘవేంద్ర ఆస్పత్రి ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు.

ఎన్నికల సరళి చూసి ఓర్వలేకే వైసీపీ దాడులు

»టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ

మహారాణిపేట, మే 15: రాష్ట్రంలో ఎన్నికల సరళిని చూసి ఓర్వలేకనే వైసీపీ దాడులకు పాల్పడుతోందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతిలో టీడీపీ అభ్యర్థి పులపర్తి నానిపై జరిగిన దాడిని ఖండిస్తున్నామన్నారు. వైసీపీనేత చెవిరెడ్డి కుమారుడు చేసిన దౌర్జన్యం ప్రజాస్వామ్యానికే మచ్చ అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయితే, రాష్ట్రానికి ముప్పేనని చెప్పి ఎస్.కోటకుచెందిన ఓ వైసీపీ నేత కుమారుడు చంద్రబాబు కోసం ఓటు వేసేందుకు బెంగళూరు నుంచి రావడం వాస్తవ పరిస్థితులను తెటతెల్లం చేసిందని తెలిపారు. జగన్ తనకు వచ్చిన అవకాశాన్ని దుర్వినియోగం చేసుకున్నారని అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీ లన్నీ నెరవేర్చుతామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు గొంప సత్య నారాయణ, జిల్లా మీడియా కోఆర్డినేటర్ కె.గోపాలరెడ్డి పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులు క్లీన్ స్వీప్ తథ్యం

డాబాగార్డెన్స్, మే 15: ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాలతో పాటు ఉత్తరాంధ్రలోని కూటమి అభ్యర్థులు క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని తెలుగుశక్తి తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా విశాఖలో ప్రమాణస్వీకారం చేయాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఇదే విషయమై టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు గండిబాబ్జీతో చర్చించినట్టు చెప్పారు. చంద్రబాబుకు ఈ విషయాన్ని తెలియజేయాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మండవ జ్యోతి, ఎన్.భార్గవి, బి. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


గండిబాబ్జీని కలిసిన తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్

ఎల్‌అండ్‌టీకి నౌకల నిర్మాణ బాధ్యత అప్పగింత అక్రమం

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు

జగదాంబ కూడలి, మే 15: కేంద్ర రక్షణ రంగంలో వినియోగించే ఫ్లీట్ సపోర్టు నౌకల నిర్మాణ పనులను ఎల్‌అండ్‌టీ సంస్థకు కాకుండా హిందూస్థాన్‌షిప్‌యార్డ్ మాత్రమే చేపట్టాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీ హెచ్ నరసింగరావు అన్నారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రక్షణ రంగానికి చెందిన 5 ఫ్లీనట్ సపోర్టు నౌకలను రూ. 20 వేల కోట్లతో నిర్మించేందుకు విశాఖలోని హిందూస్థాన్ షిప్‌యార్డ్‌కు ఆర్డర్ ఇచ్చారన్నారు. షిప్‌యార్డ్ యజమాన్యం ఈఆర్డర్‌లో రెండు నౌకలను ఎల్‌అండ్‌టీ అప్పగించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. దేశంలోనే విశాఖ షిప్‌యార్డ్‌కు సహజసిద్ధమైన డ్రై డాక్‌లున్నాయని, ఇక్కడ సుమారు 7,500 వరకు పర్మినెంట్ నైపుణ్యత గల కార్మికులు పనిచేస్తున్నారన్నారు. 82 ఏళ్ల సుదీర్ఘ అనుభవంతో ప్రత్యేక గుర్తింపు కలిగిఉందన్నారు. అయినా, నౌకల నిర్మాణ పనులు ఎల్‌అండ్‌టీకి అప్పగించడం దుర్మార్గమని ఆయన అభివర్ణించారు. కేంద్రంలోని రక్షణ రంగ శాఖ తక్షణం ఈ అడ్డగోలు చర్యలను నిలుపుచేయాలని డిమాండ్ చేశారు. అలాగే, ఎల్‌అండ్‌టీ సంస్థకు మొత్తం 5 ఫ్లీట్ నౌకల నిర్మాణ పనుల అప్పగింతకు సీఎండీ పన్నుతున్నారని ఆరోపించారు. ప్రైవేట్ సంస్థలైన ఎల్‌అండ్‌టీ, ఎస్ఈడీఎస్ కొచ్చిన్ తదితర సంస్థలకు కట్టబెట్టిన ఆర్డర్లను వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆ రేకేఎస్ రవికుమార్, ఉపాధ్యక్షుడు కేఎం కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరసింగరావు

లారీ ఢీకొని వ్యక్తి మృతి


గుమ్మడి మధు (ఫైల్)

కొమ్మాది, మే 15: చంద్రంపాలెం జాతీయ రహదారిపై లారీ, బైక్ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. పీఎంపాలెం సీఐ వై. రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. కొమ్మాది సమీపంలోని సాయిరాం కాలనీలో నివసిస్తున్న గుమ్మడి మధు బుధవారం ద్విచక్ర వాహనం మీద నగరం నుంచి ఇంటికి వస్తుండగా అదే మార్గంలో విజయనగరం వైపు వెళుతున్న లారీ చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా వెనుక నుంచి ఢీకొంది. దీంతో మధు తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు మనోజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. కాగా మధు మధురవాడ పరిసర ప్రాంతంలో అందరికీ సుపరిచితుడు ఆయన సాయిరాం కాలనీలోని వినాయకుడి ఆలయం ధర్మకర్తగా ఉన్నారు. అతనికి సినీ హీరో దగ్గుపాటి వెంకటేష్ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. స్థానిక టీడీపీ నాయకుడిగానూ గుర్తింపు ఉంది. మధు మృతితో సాయిరాం కాలనీ ప్రాంతంలో విషాదం నెలకొంది. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కొమ్మాది, మే 15: విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన పీఎం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వై. రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. నందిక చిన్నా (27), భార్య కుమార్తెతో కలిసి కొమ్మాది దరి శ్రీనివాసనగర్‌లో ఉంటున్నాడు. రాడ్ బెండింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 4న శివశక్తినగర్‌లో ఒక భవనం వద్ద రాడ్ బెండింగ్ పనుల కోసం కింద నుంచి పైఅంతస్తుకు రాడ్‌లు తరలిస్తుండగా విద్యుత్ వైర్లకుతగలడంతో షాక్ గురై రెండవ ఫ్లోర్ నుంచి కిందకు పడిపోయాడు. దీంతో ఆయన ముఖానికి, తలకు తీవ్ర గాయాలు కావడంతో మధురవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య నందిక సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

పిల్లలు లేరని వివాహిత ఆత్మహత్య

కొమ్మాది, మే 15: పిల్లలు లేరన్న బాధతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన పీఎం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. కొమ్మాది దరి అమరావతి కాలనీలో బ్లాక్ నంబరు 29 గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎల్లా నాగమణి కుటుంబంతో కలిసి నివస్తోంది. ఆమె కుమార్తె సత్యవేణికి పదేళ్ల క్రితం విత్తనాల శ్రీనివాస్‌తో వివాహం చేశారు. కుమార్తె, అల్లుడు కూడా అదే కాలనీలో బ్లాక్ నంబరు 10 ఎప్.ఎప్1లో నివసిస్తున్నారు. శ్రీనివాస్ ఒక ప్రైవేటు సంస్థలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. మంగళవారం ఆయన డ్యూటీ నిమిత్తం మధ్యాహ్నం 2 గంటలకు బయటకు వెళ్లాడు. ఈమేరకు సత్యవేణికి రాత్రి 7 గంటల సమయంలో శ్రీనివాస్ ఫోన్ చేయగా ఎప్పటికీ లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి ఆమె తల్లి నాగమణికి ఫోన్ చేశాడు. ఆమె వెంటనే కుమార్తె ఇంటికి వెళ్లి తలుపు తట్టినా తీయకపోవడంతో స్థానికుల సహకారంతో తలుపులు తెరిచి చూసేసరికి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెంది ఉంది. నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడి మృతి

ఆరిలోవ, మే 15: ఆరిలోవలోని స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ సమీపంలో నాలుగు రోజుల క్రితం ఓ వృద్ధుడు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. అతన్ని ఓ మహిళ 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించగా బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు.

సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ


జోన్-1 ప్రాంతీయ జేడీ విజయ్ భాస్కర్

మహారాణిపేట, మే 15: బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ వారి ఆధ్వర్యంలో విజ్ఞాన శాస్త్రాన్ని ప్రమాణాల ఆధారంగా నేర్చుకోవడంపై ఉపాధ్యాయులకు బుధవారం పామ్ బీచ్ హోటల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్-1 ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ బీ విజయ్ భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన రీతిలో బోధనందించడంలో సైన్స్ ఉపాధ్యాయులు ముందుండాలని కోరారు. విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెం దిన బీఐఎస్ స్టాండర్డ్స్ క్లబ్‌లను కలిగి ఉన్న పాఠశాలలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయులకు ఈ శిక్షణ నిర్వహించారు. డిప్యూటీ డైరెక్టర్ డి.వివేక్ వర్ధన్ రెడ్డి, సెక్షన్ అఫీసర్ భావనారాయణ పాల్గొన్నారు.

వైసీపీ సేవలో వలంటీర్లు

... 5వ పేజీ తరువాయి

చేసేందుకు ప్రయత్నం చేశారు. అలాగే నగదు పంపిణీతో ఆగిపోకుండా పోలింగ్ రోజున ఓటర్లను ఇంటి నుంచి పోలింగ్ బూత్ వరకూ తీసుకువెళ్లడం, పోలింగ్ బూత్ వద్దకు వచ్చిన పరిచయస్తులను వైసీపీ అభ్యర్థికి ఓటు వేయాల్సిందిగా కోరడం కనిపించింది. వైసీపీ అభ్యర్థులు కూడా తమ నియోజకవర్గ పరిధిలో వలంటీర్లతో ఎన్నికలషెడ్యూల్ విడుదలైనప్పుడే సమావేశాలు ఏర్పాటుచేసి కానుకలు అందజేశారు. అదేవిధంగా డ్వాక్రా గ్రూపులను పర్యవేక్షించే యూసీడీ విభాగంలోని రీసోర్స్ పర్సన్లకు కూడా వైసీపీ అభ్యర్థులు కాసుల హారాలు అందజేసి తమ విజయానికి సహకరించాలని కోరినట్టు తెలిసింది.

పెల్లుబుకిన ప్రభుత్వ వ్యతిరేకత?

... 5వ పేజీ తరువాయి

చంద్రబాబునాయుడు హామీ ఇవ్వడంతో నూజివీడులో కోచింగ్ తీసుకుంటున్న 20 మంది వచ్చి కూటమి అభ్యర్థులకు ఓటేశామని సరిత అనే యువతి చెప్పింది. గడిచిన ఐదేళ్లలో రియల్ ఎస్టేట్ బాగా దెబ్బతిందని, వ్యాపారాలు తగ్గుముఖం పట్టడంతో వెంచర్లు వేయడమే మానేశామని నగరానికి చెందిన ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి పేర్కొన్నారు. అధికార పార్టీ నాయకులు గడిచిన ఐదేళ్లలో వ్యవహరించిన తీరు, న్యాయానికి, చట్టానికి విరుద్ధంగా చేపట్టిన అనేక కార్యక్రమాలు, నగర పరిధిలో ప్రతిపక్ష నాయకులకు సంబంధించిన ఆస్తులపై దాడులు వంటివి ఆందోళన కలిగించాయని,మరోసారి అధికారాన్ని కట్టబెడితే ఏం చేస్తారన్న భయంతో కూటమికి ఓటేశానని ఓ ప్రైవేటు కాలేజీ లెక్చరర్ పేర్కొన్నారు.

నిరుపేద వర్గాల్లోనూ...

గత ఎన్నికల్లో వైసీపీకి మద్దతుగా నిలిచిన రోజువారీ కూలీలు, భవన నిర్మాణ రంగ కార్మికులు, మాల్స్, ఇతర దుకాణాల్లో పనిచేసే చిరుద్యోగులు కూడా ఈసారి వైసీపీకి వ్యతిరేకంగా కనిపించారు. పెరిగిన ధరలు, విద్యుత్, ఆర్టీసీ చార్జీల పెంపు వంటి అంశాలు ఈ వర్గాలను వైసీపీకి వ్యతిరేకంగా ఓటేసేలా ప్రభావితం చేసినట్టు చెబుతున్నారు. నెలకు రూ.15 వేలు వేతనం ఇస్తున్నారని, ఆ మొత్తం ఇంటి అద్దె, నిత్యావసరాలకొనుగోలుకే సరిపోతోందని, బతకడం కష్టంగా ఉంటోందని రవి అనే ప్రైవేటు ఉద్యోగి వాపోయారు. కూటమి అధికారంలోకి వస్తే గ్యాస్ సిలిండర్ భారమైనా తగ్గుతుందని, తన భార్య కూడా వస్త్ర దుకాణంలో పని చేస్తోందని, ఆమెకు బస్‌చార్జీలుమిగులుతాయని కూటమికి ఓటేశామన్నారు. కూటమి ప్రవేశపెడతామన్న పథకాలు బాగున్నాయని,అందుకే ఓటేశానని లక్ష్మి అనే గృహిణి పేర్కొన్నారు. జగన్ వచ్చిన తరువాత భవన నిర్మాణ కార్మికులకు రూపాయి కూడా సాయం చేయలేదని, గత ఎన్నికల్లో జగన్ కోసం పది మందితో ఓట్లేయించానని, ఈ ఎన్నికల్లో 20 మందికి చెప్పి మరీ కూటమికి ఓట్లేసేలా చేశానని రామారావు అనే తాపీమేస్త్రీ పేర్కొన్నాడు.ఇలాఅన్నివర్గాల్లోనూ వైసీపీపై స్పష్టమైన వ్యతిరేకత కనిపించింది.

యూజీడీ బాదుడు

... 5వ పేజీ తరువాయి

అవాక్కవుతున్నారు. కొత్తగా సివరేజ్ చార్జీలు ఏమిటంటూ జీవీఎంసీ రెవెన్యూ విభాగం అధికారుల వద్దకు వెళ్లి ఆరా తీస్తున్నారు. ఇప్పటికే అనేక పేర్లతో పన్నుల భారం మోపిన వైసీపీ ప్రభుత్వం యూజీడీ పేరుతో కొత్తగా పన్ను వేయడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ఏటా రూ.40 కోట్లు భారం

జీవీఎంసీ విధిస్తున్న సివరేజ్ చార్జీల కారణంగా నగరవాసులపై ఏటా రూ.40 కోట్లు అదనపు భారం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కొళాయి చార్జీలో మూడో వంతుగా సివరేజ్ చార్జీ విధించాలని నిర్ణయించడంతో నీటి చార్జీలు రూపంలో వచ్చే ఆదాయంలో మూడో వంతు జీవీఎంసీకి సమకూరుతుంది. పరిశ్రమలకు ఇచ్చే బల్క్ కనెక్షన్లను మినహాయిస్తే నీటి సరఫరా చార్జీల రూపంలో జీవీఎంసీకి సెమీ బల్క్, వ్యక్తిగత కొళాయి కనెక్షన్ల ద్వారా ఏటా రూ.120 కోట్లు వరకూ సమకూరుతుంది. దీనిలో మూడో వంతు అంటే రూ.40 కోట్ల వరకూ ఉండవచ్చునని జీవీఎంసీ నీటిసరఫరా విభాగం అధికారులు అంచనా వేస్తున్నారు. ఆ మొత్తాన్ని ఇకపై ఏటా నగరవాసులు జీవీఎంసీకి చెల్లించాల్సి ఉంటుందన్నమాట.

నేటి నుంచి ఏపీ ఈఏపీసెట్

... 5వ పేజీ తరువాయి

రీజనల్ సెంటర్ పరిధిలో ఇంజనీరింగ్‌కు 10,131 మంది, ఫార్మసీ అండ్ అగ్రికల్చర్ కోర్సుకు 3,479 మంది, రెండు కోర్సులకు కలిపి 37 మంది కలిపి మొత్తం 13,647 మంది దరఖాస్తు చేశారు. అలాగే, విశాఖపట్నం రీజనల్ సెంటర్ పరిధిలో ఇంజనీరింగ్‌కు 20,502 మంది, ఫార్మసీ అండ్ అగ్రికల్చర్ కోర్సుకు 5,793 మంది, రెండింటికీ కలిపి 70 మంది..మొత్తం 26,365 మంది దరఖాస్తు చేసుకున్నారు.

నేడు భీమిలిలో తాగునీటి సరఫరా నిలుపుదల

భీమునిపట్నం, మే 15 : జీవీఎంసీ జోన్ వన్ పరిధిలోని పలు ప్రాంతాలకు గురువారం తాగునీటి సరఫరా నిలుపుదల చేయనున్నట్టు జోనల్ కమిషనరు కనక మహాలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. తగరపువలస, చిట్టివలస చెరువు ఏరియా నుంచి భీమిలి మినీ స్టేడియం వరకు ఇటీవల కొత్తగా 350 ఎంఎం డీఐ పైపులైన్ ఏర్పాటు చేశామన్నారు. ఈమేరకు ఇంటర్ కనెక్షన్ పనులు చేపట్టాల్సి ఉండడంతో భీమిలిలోని 450 కెఎల్, 800 కెఎల్ రిజర్వాయర్ల నుంచి నీటి సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. పట్టణంలోని ఎగువపేట, బోయవీధి, గంటస్తంభం, తోటవీధి, అప్పికొండవీధి, గొల్లవీధి,గొల్లలపాలెం, కృష్ణాకాలనీ, బ్యాంక్ కాలనీ ప్రాంతాలకు కుళాయిల ద్వారా నీటి సరఫరా జరగదని తెలిపారు. ప్రత్యామ్నాయంగా ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తామని, అవసరమైన వారు 9866046100 ఫోన్ నంబరును సంప్రతించాలని ఆమె సూచించారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



సింహాచలం, మే 15 : వరాహలక్ష్మీనృసింహస్వామికి బుధవారం పలు ఆర్జిత సేవలను వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయ దేవేరులతో పలు రకాల పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నృసింహ సహస్రనామావళి పఠిస్తూ తులసీ దళాలతో అర్చన చేశారు. అనంతరం అదే వేదికపై పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో నిత్య కల్యాణం జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాల్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

పోలింగ్ సిబ్బందికి పారితోషికాలు పెంచాలి

భీమునిపట్నం (రూరల్), మే 15 : ఎన్నికల సిబ్బందికి చెల్లించిన పారితోషికాలు చాలా తక్కువగా ఉన్నాయని, వాటిని పెంచాలని పీఆర్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం తాళ్లవలసలో ఆ సంఘం జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వర్మ మాట్లాడుతూ మూడు రోజుల పాటు పని చేసిన ఎన్నికల సిబ్బందికి (ఓపీఓ) కేవలం రూ. 900 మాత్రమే చెల్లించారన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్ నిర్వహణ తర్వాత మరో మూడు గంటలు అదనంగా పని చేసినప్పటికీ రోజు కూలీ లెక్కన కూడా చెల్లింపులు జరగలేదన్నారు. తెలంగాణాలో ఓపీఓలకు రూ. 1500 చెల్లించారని,ఏపీలో మాత్రం చాలా తక్కువగా ఇచ్చారన్నారు. ఇది ఉపాధి కూలీలకు చెల్లించే రోజు వారి చెల్లింపుల కంటే చాలా తక్కువ అన్నారు. ప్రభుత్వం ఈవిషయాన్ని పునః సమీక్షించి అదనపు చెల్లింపులు చేయాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు ఆర్. ఆదియ్య, ఎన్. నర్సింహమూర్తి, జీటీవీఎస్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

'కార్మికుల ఆందోళనలు పట్టని మోదీ'

కూర్మన్నపాలెం, మే 15 : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మికులు రోజుల తరబడి ఆందోళన చేస్తున్నా ప్రధాని మోదీ పట్టించుకోకపోడం దారుణమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1,189వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ తొమ్మిదేళ్ల పాలనలో ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారన్నారు. ఇప్పటికైనా ఉక్కు ప్రైవేటీకరణ యోచనను విరమించాలని డిమాండ్ చేశారు. నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టడమే మోదీ లక్ష్యంగా మారిందని మండిపడ్డారు. ప్రజలంతా ఐక్యంగా ఉంటేనే దేశ సంపద పరిరక్షించుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **బాక్ :** జగదాంబ, శ్రీరామ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక)
- **ఆ ఒక్కటి అడక్కు :** మెలోడీ, సంగం, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత(శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), శ్రీకన్య సినిపోలీస్ , దుర్గ, (మధురవాడ).
- **ప్రసన్నవదనం :** శరత్, వెంకటేశ్వర-1, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),
- **శబరి :** వెంకటేశ్వర.
- **రత్నం :** అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** శారద, మోహిని (గాజువాక),
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా 21, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 38, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 34, బీరకాయలు 44, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 26, క్యారెట్ 36, దొండకాయలు 27, బంగాళదుంపలు 27, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది) 150, బరబాటి 50, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 98, గోరుచిక్కుడు 36, దోసకాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 185, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 70, పొటల్స్ 42, కీరదోస 30, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 42, కంద 66, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	135
ఫారం ధర	--	155
విత్ స్కిన్	--	280
స్కిన్‌లెస్	--	290

గ్రామీణ ఓటర్లలో చైతన్యం

- అర్బన్‌తో పోలిస్తే పెరిగిన పోలింగ్ శాతం
- కొన్నిచోట్ల 95 శాతం వరకూ ఓటింగ్



భీమునిపట్నం, మే 15 : నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఓటింగ్ సరళి పరిశీలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే జీవీఎంసీ వార్డుల్లో పోలింగ్ చాలా తక్కువగా జరిగింది. నియోజకవర్గం పద్మనాభం, ఆనందపురం, భీమిలి మండలాలతో పాటు జీవీఎంసీ 1 నుంచి 8 వార్డులు, 14, 15, 45, 89, 98 వార్డుల్లోని కొన్ని ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. ఇక్కడ మొత్తం ఓటర్లు 3,63,013 మంది కాగా పోలింగ్ బూత్‌లు 348 ఏర్పాటు చేశారు. ఓటర్ల సంఖ్య 1500 ఎక్కువగా ఉండడంతో మరో ఆరు బూత్‌లు అటాచ్‌గా ఏర్పాటు చేశారు. వీటిలో 50 బూత్‌ల్లో 90 శాతానికి పైగా పోలింగ్ జరిగింది. ఆరు బూత్‌ల్లో తొంబై ఐదు శాతం పోలింగ్ నమోదైంది. ఈ బూత్‌లన్నీ పద్మనాభం, ఆనందపురం మండలాల్లో ఉన్నాయి. పద్మనాభం మండలం బుడ్డివలస అగ్రహారం ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన 13 బూత్‌లో 96.83 శాతం ఓటింగ్ జరగ్గా పురుషులు 229 మందికి 226 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. స్త్రీలు 244 మంది వుండగా, 232 మంది ఓటు వేశారు. మొత్తం 473 ఓట్లకు 458 పోలయ్యాయి. అలాగే పేకురు ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన 48 బూత్‌లో మొత్తం 732 మంది ఓటర్లు ఉండగా, 701 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 95.77 శాతం పోలింగ్ జరిగింది. గిడిజాల పంచాయతీ వేమగొట్టిపాలెంలో ఏర్పాటు చేసిన బూత్ నంబరు 57లో 562 మందికి 537 మంది ఓటుహక్కు వినియోగించుకోగా, పోలింగ్ శాతం 95.55 నమోదైంది. ముచ్చర్లలో ఏర్పాటు చేసిన బూత్ నంబరు 58లో మొత్తం 724 మంది ఓటర్లకు 694 మంది ఓటు వేసారు. దీంతో 95.86 శాతం పోలింగ్ జరిగింది. కణమాం పంచాయతీ యాతకణమాంలో ఏర్పాటు చేసిన బూత్ నంబరు 72 లో మొత్తం ఓటర్లు 763 మంది కాగా 732 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఓటింగ్ 95.94 శాతం నమోదైంది. గంభీరం పంచాయతీ దుక్కవానిపాలెంలో ఏర్పాటు చేసిన బూత్ నంబరు 79లో మొత్తం 787 మంది వుండగా, 760 మంది ఓటు వేశారు. దీంతో 96.57 శాతం ఓటింగ్ నమోదైంది. పద్మనాభం, ఆనందపురం మండలాల్లోనే అత్యధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. భీమిలి మండలంలో మజ్జివలసలో 106 బూత్‌లో 90.96 శాతం, సింగనబందలో 109 బూత్‌లో 91.16, నారాయణరాజుపేటలో బూత్ నంబరు 110లో 90.59, కృష్ణంరాజుపేటలో బూత్ నంబరు 111లో 91.56, దాకమర్రిలో బూత్ నంబరు 113లో 90.18, మజ్జిపేటలో బూత్ నంబరు 115లో 90.02, ముద్దాడపేటలో బూత్ నంబరు 117లో 90.72, టి. నగరపాలెంలో బూత్‌నంబరు 134లో 90.41 శాతం పోలింగ్ నమోదైంది. జీవీఎంసీ విషయానికి వస్తే 2వ వార్డు డెక్కతిపాలెంలో బూత్ నంబరు 167లో 90.14, 4వ వార్డు ఆర్‌వై అగ్రహారంలో బూత్ నంబరు 193లో 93.26 శాతం ఓటింగ్ జరిగింది. నియోజకవర్గంలో 80 శాతానికి పైగా ఓటింగ్ జరిగిన బూత్‌లు 106, 70 శాతానికి పైగా ఓటింగ్ జరిగినవి 89, 60 శాతానికి పైగా ఓటింగ్ జరిగిన బూత్‌లు 83, 50 శాతానికి పైగా ఓటింగ్ జరిగిన బూత్‌లు 22, 40 శాతానికి పైగా పోలింగ్ జరిగిన బూత్‌లు 4 ఉన్నాయి. పోలింగ్ సరళిని పరిశీలిస్తే అర్బన్ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రజలే ఉత్సాహంగా ఓటు వేశారు.

7వ వార్డులో 66.5 శాతం పోలింగ్

మధురవాడ : జీవీఎంసీ ఏడో వార్డులో 66.5 శాతం ఓట్లు పోలయ్యాయి. 32 బూత్‌ల్లో 35,408 మంది ఓటర్లు ఉండగా 23,548 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. బూత్ నంబరు 30 మల్లయ్యపాలెంలో అత్యధికంగా 79.4 శాతం పోలింగ్ జరిగింది. 1237 ఓటర్లకు 983 మంది ఓటు వేశారు.

'దిశ దివ్యాంగ్ సురక్ష'కు నాలుగు ఫిర్యాదులు



ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీపీ

విశాఖపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం నగర పోలీస్ కమిషనరేట్‌లో బుధవారం నిర్వహించిన దిశ దివ్యాంగ్ సురక్ష టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌కు నాలుగు ఫిర్యాదులు అందాయి. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా రెండు, 15వ తేదీల్లో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దివ్యాంగుల సైన్ లాగ్వేజ్ తెలిసిన మహిళా కానిస్టేబుల్ ద్వారా సీపీ రవిశంకర్ అయ్యన్నార్ నేరుగా బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. తాను తీసుకున్న ఫైనాన్స్‌కు సంబంధించి ఈఎంఐలను తప్పుగా తన వద్ద నుంచి రాబడుతున్నారని ఒక బాధితురాలు ఫోన్ చేయగా, మరొకరు తనను ప్రేమించిన యువకుడు పెళ్లికి నిరాకరిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. మిగిలిన ఇద్దరు తమ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నందుకు సీపీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా సద్గురు సేవాశ్రమం వార్షికోత్సవం

భీమునిపట్నం, మే 15 : పట్టణంలోని బీచ్‌రోడ్ రామయోగి అగ్రహారంలో ఉన్న సద్గురు సేవాశ్రమం 14వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఆశ్రమానికి చెందిన సాయిరామ్ స్వామీజీ ఆధ్వర్యంలో తెల్లవారుజామున నాలుగున్నర గంటలకు విజయసాయి మందిరంలో బాబాకు కాగడ హారతితో పూజలు చేశారు. అనంతరం 108 కలశాలతో జలాభిషేకం నిర్వహించి, అఖండజ్యోతి ప్రజ్వలన చేశారు. ఉదయం పది గంటలకు స్వామీజీ ఆధ్వర్యంలో కార్యసిద్ధి సుదర్శన హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేపీ రాజు స్వామీజీ మాట్లాడుతూ ఈనెల 19వ వరకూ వార్షికోత్సవాలు జరుగుతాయన్నారు. గురువారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకూ నిర్విరామంగా సాయి నామ పఠనం, సాయంత్రం శ్రీసాయిరాజ్ ఆధ్వర్యంలో భజన ఉంటుందని చెప్పారు. 17న ఉదయం పది గంటలకు ఆకొండి వెంకటరావు ఆధ్వర్యంలో భక్తి సంగీతలహరి, సాయంత్రం 5 నుంచి అరుణకుమార్ ఆధ్వర్యంలో శ్రీసాయి భజన, 18న సాయంత్రం సూరాడ సింహాద్రి బాబా, వాసుపల్లి పోతన్న ఆధ్వర్యంలో భక్తి గాన సుధ జరగనున్నట్టు చెప్పారు. అలాగే ఆదివారం ఉదయం పది గంటలకు ప్రసిద్ధ సంగీత భజన కళాకారుడు బి. రాజారావు ఆధ్వర్యంలో బాలభారతి భజన మండలి ఆధ్వర్యంలో భక్తి రంజని, మధ్యాహ్నం అన్న సమారాధన జరుగుతుందన్నారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఓటమి భయంతోనే వైసీపీ దాడులు : మాజీ ఎంపీపీ



పద్మనాభం, మే 15 : ఓటమి భయం వల్లే వైసీపీ శ్రేణులు రెడ్డిపల్లిలో తనపై దాడికి యత్నించారని టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ డి. గోపాలకృష్ణమూర్తిరాజు (గోపీబాబు) అన్నారు. బుధవారం ఆయన పద్మనాభంలోని అనంత పద్మనాభ సేవా సంస్థ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సోమవారం పోలింగ్ సరళిని పరిశీలించడానికి గ్రామాల సందర్శనలో భాగంగా రెడ్డిపల్లి వెళ్లినప్పుడు వైసీపీ శ్రేణులు పోలీసుల సాక్షిగా తన వాహనాన్ని అడ్డుకొని దాడికి యత్నించారన్నారు. ఎమ్మెల్యే అవంతి, జెడ్పీ వైస్ ఛైర్మన్ ప్రోత్సాహంతోనే ఈ దాడి చేశారని ఆరోపించారు. గ్రామ పెద్దలు వారించినా వినలేదన్నారు. ఇటువంటి సంఘటనలు దేనికి సంకేతమని, ప్రశాంతమైన మండలంలో ఇటువంటి పోకడల ద్వారా ఉద్రిక్త వాతావరణం సృష్టించడానికి చూస్తున్నారని విమర్శించారు. కనీసం పోలింగ్ బూత్ వైపు వెళ్లని తనను ఏ ద్వేషంతో అడ్డుకున్నారని నిలదీశారు. శేరిఖండంలో కూడా టీడీపీకి ఓటు వేశారన్న కారణంతో అక్కడి వారిని ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఓటమి భయంతో వల్లే ఇటువంటి దురాగతాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ రెండు సంఘటనలపై పార్టీ పెద్దలతో మాట్లాడి ఉన్నతాధికారులకు, పోలీసు కమిషనరుకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. మండలంలోని 22 పంచాయతీల్లో 18 చోట్ల టీడీపీకి అధిక మెజారిటీ ఓట్లు వస్తాయని, గంటా నాయకత్వంలో మండలాన్ని అన్ని రంగాల్లోనూ ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కలిలసికట్టుగా పని చేస్తామని చెప్పారు.



కాటన్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రొఫెసర్లు

ఘనంగా కాటన్ జయంతి

సాగర్‌నగర్, మే 15 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సర్ ఆర్థర్ కాటన్ 221వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గీతం ప్రో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గుణశేఖరన్, సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ ముకుంద్, సీనియర్ ప్రొఫెసర్లు, కాటన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గౌతమ్‌రావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే యువత కాటన్ వంటి నిస్వార్థ నిపుణులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

మానవతా విలువలతో కూడిన బోధన అవసరం

సాగర్‌నగర్, మే 15 : విద్యార్థులకు చదువుతో పాటు మానవతా విలువలను నేర్పాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమ్ రావు అన్నారు. బుధవారం గీతం వర్సిటీలో నగరంలోని పలు కళాశాలల అధ్యాపకులకు మానవతా విలువలతో కూడిన విద్యా బోధన అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇప్పటి నుంచే సమాజం పట్ల బాధ్యత, వృత్తి విలువలు, జీవితంలో ఉన్నత వ్యక్తిత్వంతో ఎదగడం వంటివి నేర్పించాలన్నారు. ముఖ్యంగా సైన్స్, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ కోర్సులు అభ్యసించే వారు మానవతా విలువల గురించి నేర్చుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ పీవీ లక్ష్మి కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో 'నారాయణ' విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం రాజ్‌కుమార్

సిరిపురం, మే 15 : పదో తరగతి సీబీఎస్ఈ బోర్డు 2023-24 పరీక్షల్లో విశాఖలోని నారాయణ స్కూల్ విద్యార్థులు విజయభేరి మోగించారని పాఠశాల ఏజీఎం రాజ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గోవింద్ పాండే 495 మార్కులతో టాప్‌గా నిలవగా సాహితీ పుష్పాల 486, షణ్ముఖ్ ప్రజ్ఞాన్సు 484, బి. హరిప్రియ 483, జి. రాజేశ్వరి 480, జి. శ్రీక్షిత 476, టి. స్ఫూర్తినాయుడు 476 మార్కులు సాధించినట్టు చెప్పారు. మొత్తం 582 మంది 500 మార్కులకు 410 మార్కులతో అత్యధిక సగటును సాధించారన్నారు. గ్రేటర్ విశాఖలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడం నారాయణ విద్యార్థుల అద్భుతమైన విజయమని తెలిపారు. క్రమశిక్షణ, ఉన్నత విలువలతో కూడిన విద్య ఇటువంటి అద్భుతమైన విజయాన్ని అందించిందన్నారు. ఈమేరకు విద్యార్థులను కోఆర్డినేటర్ రాంనరేష్, శివప్రతాప్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.



సమావేశంలో పాల్గొన్న కూటమి లీగల్ సెల్ న్యాయవాదులు

పోలింగ్ సరళిపై కూటమి లీగల్ సెల్ న్యాయవాదుల సమీక్ష

విశాఖపట్నం, మే 15 : రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి లీగల్ సెల్ న్యాయవాదులు అభ్యర్థుల విజయానికి కీలక పాత్ర పోషించారని విశాఖపట్నం కూటమి లీగల్ సెల్ అధ్యక్షుడు బత్తిన రాజశేఖర్ పేర్కొన్నారు. లీగల్ సెల్ కార్యాలయంలో బుధవారం జరిగిన లీగల్ సెల్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చేనెల 4న జరిగే ఓట్ల కౌంటింగ్‌లో తీసుకోవలసిన జాగ్రత్తలను లీగల్ సెల్ న్యాయవాదులకు వివరించారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు జె. పృథ్వీరాజ్, టీడీపీ ప్రధాన కార్యదర్శి పతివాడ గిరిధర్, ఉపాధ్యక్షుడు కన్నూరు కిరణ్‌కుమార్, యర్ర రేవతి, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న ఒలుపు చందనం లెక్కలేవీ?

- ఏటా తూనికలో వ్యత్యాసాలు
- సమస్య మూలాలపై దృష్టిసారించని అధికారులు



చందనం పేకెట్లు (ఫైల్ ఫొటో)

సింహాచలం, మే 15: చందనోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా వైశాఖ మాస శుక్ల పక్ష తదియనాడు వరాహలక్ష్మీనృసింహస్వామి పైపూతగా ఉండి పూజలందుకున్న ఒలుపు చందనం భక్తులకు విక్రయిస్తారు. ఈ ఏడాది చందనోత్సవం నిర్వహించి ఐదు రోజులవుతున్నా ఇప్పటికీ విసర్జన చందనం ఎంత మొత్తమనే లెక్కలు వెల్లడించలేదు. గత కొన్నేళ్లుగా వలుపు చందనం లెక్కల్లో తేడాలు వస్తున్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు. ఏడాది మొత్తం స్వామిపై ఉండి నిత్య పూజలందుకోవడంతో ఒలుపు చందనాన్ని భక్తులు మహా ప్రసాదంగా భావిస్తారు.చందనోత్సవం ముందు వారం రోజుల పాటు దర్శనం టికెట్లకు, ఉత్సవానంతరం ఒలుపు చందనం టికెట్లకు భక్తులు ఎదురుచూస్తుంటారు. చందనోత్సవం నాటి సహస్ర ఘటాభిషేకం తర్వాత తొలివిడత, వైశాఖమాస పూర్ణిమ రోజున మలివిడత, జేష్ఠమాస పూర్ణిమ నాడు మూడో విడత, ఆషాడమాస పూర్ణిమ నాడు నాల్గో విడత, సమానంగా మూడేసి మణుగుల (125 కిలోల) చొప్పున మొత్తం 12 మణుగుల (500కిలో) గంధపు ముద్దలో సుగంధ ద్రవ్యాలను మిశితం చేసి స్వామికి సమర్పిస్తారు. చందనోత్సవం అనంతరం నిర్మల చందనాన్ని భక్తులు తీసుకునేందుకు ఆసక్తి చూపుతారు. అయితే చందనం దిగుబడిలో ఏటా వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. అధికారులు ప్రకటించిన లెక్కల ప్రకారం 2019లో 118.4 కిలోలు, 2020లో 114 కిలోలు, 2021లో 97 కిలోలు, 2022లో 99.3 కిలోలు, 2023లో 109 కిలోల ఒలుపు చందనం వచ్చింది. ఈనెల 10న చందనోత్సవం రాత్రే చందనాన్ని తూనిక వేసి బాంఢాగారంలో భద్రపరిచారు. దిగుబడి ఎంత వచ్చిందన్న విషయాన్ని అధికారులు ప్రకటించలేదు. గతంలో చందనాన్ని దేవస్థానానికి చెందిన కొందరు విజయనగరం వర్తకులకు, గోపాలపట్నంలోని కొందరికి విక్రయించారన్న ఆరోపణలు వినిపించాయి. ప్రభుత్వ అధికారులకు అందజేసేందుకు కూడా ఇటువంటి లెక్కల జిమిక్కులు జరుగుతున్నట్టు తెలుస్తోంది. చందనోత్సవంలో విధులు నిర్వహించేందుకు రాష్ట్రంలోని ఇతర దేవస్థానాల నుంచి వచ్చిన సిబ్బంది ఒక్కొక్కరికి రెండేసి ప్యాకెట్లను అందజేసినట్టు సమాచారం.



9వ వార్డు నాయకులతో మాట్లాడుతున్న వెలగపూడి

తూర్పులో భారీ మెజారిటీ ఖాయం

- టీడీపీ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు

విశాలాక్షినగర్/వెంకోజీపాలెం, మే 15 : తూర్పు నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీతో గెలవనున్నట్టు కూటమి అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు తెలిపారు. బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో 9వ వార్డు నాయకులు, బూత్ ఏజెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల నుంచి వచ్చిన చైతన్యంతో మరోసారి ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నమోదైన భారీ పోలింగ్ కూటమి విజయానికి సూచిక అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో 9వ వార్డు టీడీపీ అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు, నాయకులు వేజెళ్ల సుబ్బరాజు, గరికిన నూకరాజు, వెంపాడ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న దేవస్థానం ఈఓకు సిబ్బంది సత్కారం



ఈఓ శ్రీనివాసమూర్తిని అభినందిస్తున్న దేవస్థానం సిబ్బంది

సింహాచలం, మే 15 : వరాహలక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం విజయవంతంలో కీలక పాత్ర పోషించిన దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తిని ఆలయ అధికారులు ఘనంగా సత్కరించారు. మంగళవారం రాత్రి ఆలయ కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది ఈఓను శాలువతో సత్కరించి, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఐవి రమణాచార్యులు, ఏఈఓలు వీబీ రమణమూర్తి, రాజేంద్రకుమార్, నరసింహరాజు, ఇన్‌చార్జి ఏఈఓ పాలూరి నరసింగరావు పాల్గొన్నారు.

19న జూలో వ్యాసరచన పోటీలు

ఆరిలోవ, మే 15 : నగరంలోని జూపార్కులో ఈనెల 19న అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించనున్నట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారీయా తెలిపారు. బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జూలోని బైస్కోపు సెంటర్‌లో ఆ ఉదయం 10 గంటల ఈ పోటీలు జరుగుతాయన్నారు. 1వ తరగతి నుంచి పీజీ వరకు చదువుతున్న వారు పోటీల్లో పాల్గొనవచ్చునని తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, వ్యక్తిత్వ వికాసం పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆసక్తి గల వారు 789 363 2900 సెల్ నంబరు సంప్రతించాలని ఆమె సూచించారు.

శిల్పారామంలో చేనేత వస్త్ర ప్రదర్శన



వస్త్ర ప్రదర్శనలో ఉంచిన చీరలు, షర్టులు

మధురవాడ, మే 15 : శిల్పారామంలో గత నెలలో ప్రారంభమైన అఖిల భారత చేనేత వస్త్ర ప్రదర్శన ఈనెల 23 వరకూ కొనసాగనుంది. భావనారుషి చేనేత హస్తకళా కార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. మొత్తం 70 స్టాల్స్ ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన చేనేత కళాకారులు ఈ స్టాల్స్‌లో తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. మంగళగిరి, పోచంపల్లి, గద్వాల్, కలంకారి, ఉప్పాడ, తదితర చేనేత వస్త్రాలతో పాటు కర్రతో తయారు చేసిన అలంకరణ సామగ్రి, తివాచీలు, మహిళల అలంకరణ వస్తువులను అందుబాటులో ఉంచారు. ప్రతిరోజూ ఉదయం 11 నుంచి రాత్రి 9 వరకు ప్రదర్శన ఉంటుందని, సందర్శకులకు ఉచిత ప్రవేశం కల్పించామని శిల్పారామం పరిపాలనాధికారి విశ్వనాథరెడ్డి తెలిపారు.

మురుగు నీటితో రాకపోకలకు అవస్థలు



బ్యాంకులకు వెళ్లే మార్గంలో ఉన్న మురుగు

సింహాచలం, మే 15 : జీవీఎంసీ 98వ వార్డులో ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకులకు వెళ్లే మార్గంలో మురుగు నీటి ప్రవాహం వల్ల స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ప్రతి గురువారం వారపు సంత జరుగుతోంది. ఈ ప్రదేశంలో ఈ రెండు బ్యాంకుల శాఖలు ఉన్నాయి. వాటికి ఎదురుగా దేవస్థానానికి చెందిన దుకాణాల సముదాయం ఉంది. దానికి ఆనుకుని ఉన్న డ్రైనేజీ శిథిలం కావడంతో అందులోని మురుగు నీరు బయటకు వచ్చి బ్యాంకులకు వెళ్లే మార్గంలో నిలిచిపోతుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి డ్రైనేజీకి మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అసంపూర్తిగా రోడ్డు పనులు



క్రషర్ బుగ్గితో అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులు

ఆరిలోవ, మే 15 : పెదగదిలి జంక్షన్ నుంచి తోటగరవు వెళ్లే మార్గంలో రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ మార్గంలో రూ. 4 కోట్ల జీవీఎంసీ నిధులతో వంతెన పనులు చేపడుతున్నారు. రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండడంతో క్రషర్ బుగ్గి వల్ల దుమ్ము ధూళి రేగి వాహనదారులు, పాదచారులు రాకపోకలకు నరకయాతన పడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తగరపువలసలో వేసవి శిక్షణ శిబిరం

తగరపువలస, మే 15 : స్థానిక ఆదర్శనగర్‌లో బుధ వారం నుంచి కరాటేలో ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈమేరకు నిర్వాహకులు ఒక ప్రకటన విడుదల చేశారు. వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం గంట పాటు శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం 30 మంది శిక్షణ పొందుతున్నారని, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోచ్ పరదేశి కోరారు.